
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 30 అక్టోబరు 2025 | 5

కదిలే విపత్తు నిర్వహణ
'ఎన్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ వాహనం' 6



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తుఫాన్ ప్రభావానికి గురైన ప్రాంతాన్ని హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే ద్వారా పొలాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

మిమ్మల్ని ఆదుకునేందుకే

నేనున్నా



బెండమూర్లంకలో పడిపోయిన వరిని పరిశీలిస్తున్న సీఎం

- ఓడలరేవు పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులకు సీఎం భరోసా
- రైతులను ఆదుకుంటానని బెండమూర్లంకలో హామీ
- ఓడలరేవులో పర్యటించిన చంద్రబాబు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

తుఫాన్ కష్టాల్లో ఉన్న మిమ్మల్ని ఆదుకోవడానికే నేను ఉన్నా.. అందుకే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోయినా మిమ్మల్ని పలుకరించి ధైర్యం చెప్పాలని వచ్చానమ్మా. మీరెవ్వరూ భయపడొద్దంటూ తుఫాన్ బారినపడిన బాధితులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. మొంథా తుఫాన్ నష్టాలను హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్‌లో బుధవారం మధ్యాహ్నం దిగిన చంద్రబాబుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎంపీ హరీష్‌బాలయోగితోపాటు కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబునాయుడు నేరుగా ఓడలరేవులోని తుఫాన్ షెల్టర్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ షెల్టర్‌లో ఉన్న బాధితులను చంద్రబాబు అందరినీ పలుకరిస్తూ నమస్కరిస్తూ ముందుకు సాగారు. తర్వాత బాధితుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ హెచ్చరికలు తమను ఎంతో భయాందోళనకు గురిచేశాయని, మంగళవారం రాత్రి బతుకు జీవుడా అంటూ భయం గుప్పిట్లో జీవించామని మహిళలు చంద్రబాబు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వారి కష్ట సుఖాలను చంద్రబాబు అడిగి తెలుసుకుని మీరెవ్వరూ అధైర్య పడొద్దు నేనున్నానంటూ వారందరికీ భరోసా ఇచ్చారు. ఆ ప్రాంతంలో తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టాలను అడిగి తెలుసుకున్నారు.



అల్లవరం మండలం ఓడలరేవులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



అల్లవరం మండలం బెండమూర్లంకలో పడిపోయిన వరి చేలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

అనంతరం బాధితులకు 25 కిలోల బియ్యం ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు వంతున ఆర్థికసాయాన్ని చంద్రబాబు అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు పడే ఇబ్బందులు నాకు తెలుసు. అందుకే వారికి ఏ కష్టం కలగకుండా అన్నివిధాలా చర్యలు తీసుకుంటూ వారిని మనస్ఫూర్తిగా ఆదుకుంటాను. అది నా నైజం. దీంట్లో ఎటువంటి రాజకీయాలు ఉండవు. మీకు ఏ కష్టం వచ్చినా నేనున్నాను అనే భరోసా ఇచ్చేందుకు ఇంతదూరం వచ్చి మీతో మాట్లాడితే మీ కష్టం తీరడంతోపాటు నాలో కూడా బాధ తగ్గుతుంది.. మీరు అధైర్య పడొద్దు. మీకు నేనున్నానంటూ పదేపదే భరోసా ఇచ్చారు. అదే రీతిన బెండమూర్లంకలో తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంట నష్టాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు రైతు నాయకులు యాళ్ల బ్రహ్మానందం, యాళ్ల దొరబాబులతోపాటు పలువురు రైతుల నుంచి నష్టాలను అడిగితెలుసుకున్నారు. పంట నష్టాలను అధికారులు నివేదించిన తర్వాత రైతులకు సహాయం ప్రకటిస్తానని రైతుల సమక్షంలో హర్షధ్వానాల మధ్య ప్రకటించి వారికి భరోసా ఇచ్చారు.

హమ్మయ్య.. గట్టెక్కాం!

- తప్పిన తుఫాన్ ముప్పు
- ఊపిరి పీల్చిన ప్రజలు
- మునిగిన రైతాంగం
- పంటలకు తీవ్ర నష్టం
- రోడ్లు ధ్వంసం
- 244 విద్యుత్ స్తంభాలు నేలమట్టం
- 26 ట్రాన్స్‌ఫార్మర్లకు దెబ్బ
- నేలకూలిన 96 చెట్లు
- వెంటనే పునరుద్ధరించిన అధికార యంత్రాంగం
- మంత్రి దుర్గేష్, కలెక్టర్, ఎమ్మెల్యేల పర్యటనలు
- విమానాలు, బస్సులు, రైళ్ల రాకపోకలు యథాతథం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముప్పు తప్పింది. కాకినాడ నుంచి అంతర్వేది వరకూ ఎక్కడ తీరం దాటినా రాజమండ్రితోపాటు జిల్లాలో కూడా ప్రభావం ఉండేది. కానీ తుఫాన్ దోబూచులాడుతూ గంటల కొద్దీ ఇబ్బంది పెట్టినా, అనుకున్నంత స్థాయిలో ప్రభావం చూపకుండానే ప్రజల మీద కనికరం చూపింది. దీంతో జిల్లా ప్రజలతోపాటు జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. కానీ సాధారణ వర్షాలు, వరదలకు నష్టపోయినట్టే పంట నష్టాలు అధికంగానే ఉన్నాయి. వరి, అపరాలు, ఉద్యానవన పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. చాలా పంటనీట మునిగిపోయింది. ఇది తేరుకోవడానికి సమయం పడుతుంది. కానీ నష్టమే ఎక్కువ ఉంటుంది. తుఫాన్ ప్రభావంతో మంగళ, బుధవారాలలో జిల్లాలో మొత్తం 96 చెట్లు నేల కూలిపోగా, 244 విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. 26 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. కానీ కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండడం, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, జిల్లాలోని ఎమ్మెల్యేలు నిత్యం అధికార్లకు సూచలు, సలహాలు ఇవ్వడంతోపాటు నిత్యం ప్రజల్లోనే ఉండడం, ప్రత్యేకాధికారి కె.కన్నబాబు సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో మొత్తం అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు స్పందించి, సమస్య లేకుండా చేసి శభాష్ అనిపించుకున్నారు. మొత్తం 2 వేలకు పైగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సిబ్బంది పనిచేశారు. భారీ గాలులు, వానలకు చెట్లు కూలిపోవడంతోపాటు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. కానీ 1200 మంది విద్యుత్ కార్మికులు, అధికారులు పనిచేసి తెల్లవారుజామునకే పడిపోయిన చెట్లను, స్తంభాలను పునరుద్ధరించారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండడంతోపాటు తుఫాన్ గురించి విస్తృత ప్రచారం వల్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండడంతో జిల్లాలో ప్రాణ నష్టం ఏమీ జరగలేదు. జిల్లాలో 244 విద్యుత్ స్తంభాలు నేలకూలగా, 26 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. బుధవారం తెలవారుజాము సమయానికి మొత్తం పునరుద్ధరించి విద్యుత్ సరఫరా అందించారు. ఏపీఈపీడీసీఎల్‌కు సుమారు 45 లక్షల నష్టం జరిగినట్టు అంచనా వేశారు. వరిపంట అత్యధికంగా 18 మండలాల పరిధిలోని 207 గ్రామాల్లోని 17325మంది రైతులకు చెందిన 1012.25 హెక్టార్లు వరి పంట దెబ్బతింది. 13,213 హెక్టార్ల వరిపంట నేలకొరిగింది. ఇక ఐదుమండలాల పరిధిలోని 27గ్రామాలలోని 1497మంది రైతులకు చెందిన1041.8హెక్టార్లలోని మినప పంట దెబ్బతినగా, 306.8హెక్టార్లలో నీటికి ఒరిగిపోయింది. మొత్తం జిల్లాలో 234 గ్రామాల పరిధిలోని 18,822 రైతులకు చెందిన 2054.05 హెక్టార్లలో పంట పూర్తిగా దెబ్బతినగా, 13,520.19 హెక్టార్లలో ఒరిగిపోయింది. ఇక ఎర్రకాలువకు వరద రావడంతో నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో వరి మునిగిపోయింది. జిల్లాలో 1960మంది రైతులకు చెందిన 1108.80 హెక్టార్లలో ఉద్యానవన పంటలు, జిల్లాలో 96 గృహాలు కూలిపోయాయి. పంచాయతీరాజ్‌కు చెందిన 50కి.మీ రోడ్లు గోతులుపడ్డాయి.

నిడదవోలు మండలం కంసాలపాలెం వద్ద ఎర్రకాలువ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్



నల్లజర్లలో తుఫాన్ నష్టంపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్







కడియం ఆవలో పడిపోయిన పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు.. తుఫాన్ తీరాన్ని దాటుతున్న బుధవారం తెల్లవారుజామున పెరవలి నుంచి అంతర్వేది వైపు ఆకాశంలో కనిపించిన వెలుగు.. తీపర్రులో పడిన అరటి

రవాణా వ్యవస్థ యథాతథం

జిల్లాలో బుధవారం రవాణా వ్యవస్థను పునరుద్ధరించారు. సాధారణ స్థితికి రాకపోకలు చేరుకున్నాయి. రాజమండ్రి ఎయిర్‌పోర్టు నుంచి తుఫాన్ వల్ల నిలిచిపోయిన విమానాలను బుధవారం పునరుద్ధరించారు. సాధారణ రోజుల్లో మాదిరిగానే ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, తిరుపతి, చెన్నై, బెంగళూరుకు వెళ్లి వచ్చే మొత్తం 11 సర్వీసులను పునరుద్ధరించారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలో ఆర్టీసీ బస్సులన్నీ కూడా మామూలుగానే రోడెక్కాయి. రైళ్లు చాలావరకూ నడుస్తున్నాయి.

పెరిగిన వరి నష్టం... 16,172.06 హెక్టార్లలో నేలకొరిగిన పంట

జిల్లాలో పంట నష్టం అంచనాలు పెరుగుతున్నాయి. బుధవారం సాయంకాలం 6 గంటలకు అందిన సమాచారం ప్రకారం జిల్లాలో 22,504 మందికి చెందిన 2115.74 హెక్టార్లలో వరిపంట, అపరాల పంట దెబ్బతింది. 16,172 హెక్టార్లలో పంట నేలకొరిగింది. జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు కథనం ప్రకారం జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో మొత్తం వరి 70,046 హెక్టార్లలో సాగు చేయగా, తుఫాన్ ప్రభావం వల్ల 16092.1 హెక్టార్లలో పంట నేలకొరిగింది. 896.3 హెక్టార్లలో పంటకు నష్టం జరిగింది. ఇది 18మండలాల పరిధిలోని 209 గ్రామాలకు చెందిన 20,843 మంది రైతులకు చెందిన పంట. ఇది పాలుపోసుకునే దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఉంది. మినప పంట 2160.5 హెక్టార్లలో సాగుచేయగా, 80 హెక్టార్లలో నేలకొరిగింది. 1216.27 హెక్టార్లలో పూర్తిగా దెబ్బతింది. ఇది 7 మండలాల పరిధిలోని 35 గ్రామాలకు చెందిన 1658 మంది రైతులకు చెందినది.

జిల్లాలో 411.2 మీమీ వర్షపాతం నమోదు

రాజమహేంద్రవరం సిటీ : తుఫాన్ ప్రభావంతో గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు 19 మండలాల పరిధిలో 411.2 మీమీ వర్షం కురిసింది అందులో అత్యధికంగా దేవరపల్లి మండలంలో 52.2 మీమీ వర్షం కురిసింది. జిల్లాలో ఎడతెరపిలేకుండా వర్షం పడుతోంది. మండలాల వారీగా పరిశీలిస్తే అనపర్తిలో 11.2 మీమీ, బిక్కవోలులో 13.6 మీమీ, చాగల్లులో 7.4 మీమీ, గోకవరంలో 40.2 మీమీ, గోపాలపురంలో 17.0మీమీ, కడియంలో 7.8మీమీ, కోరుకొండలో 20.4 మీమీ, కొవ్వూరులో 11.6 మీమీ, నల్లజర్లలో 39.6మీమీ, నిడదవోలులో 33.8 మీమీ, పెరవలిలో 10.4 మీమీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 12.8 మీమీ, రాజమహేంద్రవరంలో 11.0మీమీ, రాజానగరంలో 28.8 మీమీ, రంగంపేటలో 23.8 మీమీ, సీతానగరంలో 26.4 మీమీ, తాళ్లపూడిలో 26.0మీమీ, ఉండ్రాజవరంలో 18.2 మీమీ వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి జిల్లావ్యాప్తంగా 384.0మీమీ వర్షం కురిసింది.అదే సాయంత్రానికి 27.2 మీమీ వర్షం నమోదైంది. సగటున జిల్లాలో 21.6 శాతం వర్షం కురిసిందని వాతావరణశాఖ తెలిపింది.

ప్రజల భద్రత.. రైతుల పంట రక్షణకు ప్రాధాన్యం

ఎర్రకాల్వను పరిశీలించిన కలెక్టర్ కీర్తి చేకూరి



అనంతపల్లి వద్ద ఎర్ర కాల్వ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

నల్లజర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో నల్లజర్ల మండలంలోని అనంతపల్లి గ్రామం వద్ద ఎర్ర కాల్వ వరద నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల భద్రత, రైతుల పంట రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రైతుల నష్టాలను అంచనా వేసి తక్షణ సాయం అందించే చర్యలు చేపడతామన్నారు. ప్రతి కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తామన్నారు. అధికారులు శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి ఎవరూ ఆందోళన చెందకుండా చూడాలన్నారు. అదేవిధంగా ఎర్రకాల్వ గడ్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి ఎర్రకాల్వకు వరద నీరు వస్తుందని, ఎంత వరద నీరు వస్తే ఇక్కడ ఎంత ప్రభావం ఉంటుందో ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆర్డీవో రాణి సుస్మిత, స్థానిక తహశీల్దార్ నాయుడు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

సీఎంకి సచివాలయ ఉద్యోగుల కృతజ్ఞతలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ విపత్తు సమయంలో సచివాలయ ఉద్యోగులు నిర్వహించిన సమర్థవంతమైన విధులకు సీఎం చంద్రబాబు తెలియజేసిన అభినందనలకు ఏపీ విలేజ్ అండ్ వార్డ్ సెక్రటేరియేట్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది. బుధవారం జరిగిన జిల్లా అడహాక్ కమిటీ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వరసాల రామదాసు మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి వరకూ అంతా ఏకతాటిపై సమన్వయంతో పనిచేయడం వల్లే నష్టం తప్పిందన్నారు.



అమలాపురం కలెక్టరేట్‌లో తుఫాన్ అనంతర పరిస్థితులపై సమీక్షిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ మహేష్‌కుమార్, ప్రత్యేకాధికారి విజయరామరాజు, ఎంపీ హరీష్, ఎమ్మెల్యేలు

మొంథా తుఫాన్

తీవ్రత స్వల్పమే

- జిల్లాలో 54 విద్యుత్ సబ్ స్టేషన్‌లపై ప్రభావం
- పడిపోయిన 300 విద్యుత్ స్తంభాలు
- 134 కిలోమీటర్ల మేర కుప్పకూలిన వృక్షాలు
- 41 కేంద్రాల్లో 10వేల మందికి పైగా ఆశ్రయం
- బాధిత కుటుంబాలకు రూ.3వేలు ఆర్థిక సాయం
- సమీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు



అమలాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం ముందుగా ఊహించినంత తీవ్రత లేకపోయింది.. అయినప్పటికీ విద్యుత్ సరఫరా, రోడ్డు, రవాణా, రాకపోలకు ఇబ్బంది కలిగించింది అని రాష్ట్ర వ్యవసాయ సహకార, ఉద్యాన, మార్కెటింగ్, డెయిరీ డెవలప్మెంట్, మత్స్య శాఖల మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో మొంథా తుఫాన్ సహాయక చర్యలపై సమీక్షించారు. ఈదురుగాలులకు జిల్లావ్యాప్తంగా సుమారు 300 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయన్నారు. 80 శాతం పునరుద్ధరించామని, మిగిలిన 20 శాతం పూర్తి చేసి ఇళ్లకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు రేయింబవళ్లు జరుగుతున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా 54 సబ్ స్టేషన్‌లపై మొంథా తుఫాన్ ప్రభావం పడిందన్నారు. రామచంద్రపురం, రాజమహేంద్రవరం, ముమ్మిడివరం తదితర ప్రాంతాల నుంచి మానవవనరులను తరలించి విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

రహదారులపై 134 కిలోమీటర్ల మేర రాకపోకల పునరుద్ధరణ పూర్తయిందన్నారు. బుధవారం నుంచి ఆర్టీసీ బస్సులు నూటికి నూరుశాతం రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. మంగళవారం పునరావాస కేంద్రాల్లో భోజన వసతి పొందిన వారికి బుధవారం సాయంత్రం వరకు ఆశ్రయం కల్పిస్తూ రాత్రి భోజనం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.3వేల ఆర్థిక సాయం అందించి స్వగృహాలకు పంపించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో 400 పునరావాస కేంద్రాలు నిర్వహించి 10,150 మందికి ఆశ్రయం కల్పించామన్నారు. వీరిలో కుటుంబాలకు రూ.3వేలు చొప్పున, ఒంటరి సభ్యులకు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సహాయం పంపిణీ చేయాలన్నారు.

ఐదు రోజులుగా సముద్రంపై వేటకు వెళ్లకుండా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు, చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు.

గురువారం నుంచి రేషన్ డీలర్ల ద్వారా బియ్యం సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతిని ఆదేశించారు.

జిల్లావ్యాప్తంగా సుమారు 20వేల ఎకరాల్లో వరి పంట నష్టానికి గురైందని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు.

వరితో పాటు అరటి తదితర ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని గణించడానికి వేయడానికి బృందాలను నియమించామని, పూర్తిస్థాయి నివేదిక రూపొందిస్తామన్నారు. విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా పంటల నష్టాలను తగ్గించడానికి కృషి చేస్తామన్నారు.

బియ్యం, ఆర్థిక సహాయం పంపిణీలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేసి పారదర్శకంగా అందించాలనిసూచించారు.

మామిడికుదురు మండలంలో చనిపోయిన మహిళ కుటుంబానికి పోస్టుమార్టం అనంతరం టీఆర్ 27 నష్టపరిహారం రూ.5 లక్షలను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ద్వారా పంపిణీ చేయాలన్నారు.

సమావేశంలో మొంథా తుఫాన్ సహాయ చర్యల ప్రత్యేకాధికారి వి.విజయరామరాజు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎస్పీ రాహుల్‌మీనా, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, నిమ్మకాయల చినరాజప్ప, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, డీఆర్వో కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపుతో సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు, ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో మొంథా తుఫాన్‌ను అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నా మని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వాతావరణ శాఖ సూచనలతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణనష్టం లేకుండా కాపాడామన్నారు. వేలాది మందిని పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు గర్భిణులు, పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సీఎం సూచనలతో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ చర్యలు చేపట్టి నష్టాన్ని తగ్గించగలిగామన్నారు. సమర్థత కలిగిన సీఎం సూక్ష్మస్థాయిలో మేనేజ్‌మెంటు చేయగలడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి రూ.3 వేలు నగదు, 25 కిలోల బియ్యం, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు, కిలో కందిపప్పు, కిలో పంచదార, కిలో ఆయిల్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సమావేశంలో వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో బాధితులకు నగదు, నిత్యావసరాలు

కోస్తా జిల్లాల ప్రత్యేకాధికారి అజయ్‌జైన్



కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో ప్రత్యేకాధికారి అజయ్‌జైన్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావిత ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని కోస్తా జిల్లాల ప్రత్యేక అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట, నేమాం, ఉప్పాడ సముద్ర తీరాన్ని కలెక్టర్ షాన్‌మోహన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్‌జైన్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ ముప్పు తప్పిందన్నారు. గురువారం నుంచి ప్రజలకు నిత్యావసరాలను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి రూ.3వేలు నగదు, 25 కిలోల బియ్యం (మత్స్యకారులకు 50 కిలోలు) తో పాటు కిలో కందిపప్పు, లీటరు వంటనూనె, కిలో చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార అందజేస్తామన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన వాటి గణన ప్రక్రియ చేపట్టాలన్నారు. తుఫాన్ అనంతరం సహాయక చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తుఫాన్ తీరం దాటినప్పటికీ రెండు రోజుల పాటు దాని ప్రభావం ఉంటుందని, ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. పర్యటనలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పాల్గొన్నారు.



కొత్తపట్నం వద్ద పైకి వచ్చిన జియోట్యూబ్ గాబియాన్ సంచులు

అలల ఉధృతికి జియోట్యూబ్ ఛిద్రం

కొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బీభత్సానికి కాకినాడ జిల్లా ఉప్పాడ సమీపంలో కొత్తపట్నం వద్ద జియోట్యూబ్ పూర్తిగా ఛిద్రమైంది. సముద్రం ఒడ్డున నాలుగైదు అడుగుల లోతులో ఇసుకతో డంప్ చేసిన గాబియాన్ సంచులు కెరటాల ఉధృతికి పైకి లేచాయి.

అధికారులు సమన్వయంతో సేవలందించారు

- అందుకే సమస్యలను అధిగమించాం
- కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



కొత్తపట్నంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంతంలో అధికారులు సమన్వయంతో సేవలందించడంతో సమస్యలను అధిగమించామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కొత్తపట్నంలో కెరటాల ఉధృతికి గండిపడిన బీచ్ రోడ్డుకు బండ రాళ్లతో రక్షణ కల్పించడాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ స్థానిక మీడియాతో మాట్లాడారు. తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన వెంటనే కూటమి ప్రభుత్వం వేగంగా స్పందించడంతో ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తలేదన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో అధికారులు చేసిన కృషిని అభినందించారు. సీఎం, డిప్యూటీ సీఎం ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించి సంబంధిత అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చేవారన్నారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గాక ఎక్కెడక్కడ ఎంతమేర నష్టం జరిగిందో అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని ఎంపీ చెప్పారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), ఆ పార్టీ వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ వున్నారు.

మూడో రోజూ పలు రైళ్లు రద్దు

సామర్లకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మీదుగా విశాఖ, విజయవాడ వైపు రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను మూడో రోజైన బుధవారం కూడా రద్దు చేశారు. సామర్లకోట రైల్వే స్టేషన్ హెల్ప్ డెస్క్ అధికారి అందించిన సమాచారం మేరకు రద్దయిన వాటిలో 17244 రాయగడ-గుంటూరు, 07166 భువనేశ్వర్-సికింద్రాబాద్, 12805 విశాఖ-లింగంపల్లి, 18521 విశాఖ-కడప- తిరుమల, 12776 లింగంపల్లి-కాకినాడ ఎక్స్‌ప్రెస్ వున్నాయి. డోర్నకల్ జంక్షన్ వద్ద రైల్వే ట్రాక్ పైకి నీరు చేరడంతో మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించారు. వీటిలో 20833 విశాఖ-సికింద్రాబాద్, 17205 షిర్డీసాయినగర్-కాకినాడ, 17206 కాకినాడ-షిర్డీసాయినగర్ వున్నాయి. 20834 సికింద్రాబాద్-విశాఖ బుధవారం సాయంత్రం మూడు గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరాల్సి ఉండగా ఐదు గంటలు ఆలస్యంగా రాత్రి ఎనిమిది గంటలకు బయల్దేరింది. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం కూడా హెల్ప్ డెస్క్ ద్వారా సేవలందిస్తామని సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్ చెప్పారు.



రకరకాల పనిముట్లతో 'ఎన్‌డీఆర్ఎఫ్ రెస్క్యూ వాహనం'

కదిలే విపత్తు నిర్వహణ

'ఎన్‌డీఆర్ఎఫ్ రెస్క్యూ వాహనం'

- 20 రకాల వస్తువులు.. 10 టన్నుల బరువు
- బాధితుల ఆచూకీ కనుగొనే కెమెరా
- బోట్లు, లైఫ్ బాయ్స్, పవర్ సాలు.. ఇంకా ఎన్నో..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వ స్థాయిలో జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) మాదిరిగా రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర విపత్తు స్పందన దళం(ఎస్‌డీఆర్ఎఫ్) విపత్తుల సమయంలో సహాయక చర్యలకు రంగంలోకి దిగడానికి ప్రతి క్షణం సిద్ధంగా ఉంటుంది. రెస్క్యూ, వరద సహాయక చర్యలు, ప్రథమ చికిత్సవంటి వాటిలో సహాయపడుతుంది. బాధితులను రక్షించడంతోపాటు ప్రథమ చికిత్స అందించి ఆస్పత్రులకు తరలిస్తోంది. బాధితులకు ఆహారం, తాగునీరు, నిత్యావసరాల వంటి వాటిని పంపిణీ చేయడంలో స్థానిక ప్రభుత్వ యంత్రాంగానికి సహకరిస్తోంది. విపత్తు ప్రాంతాల్లో గందరగోళం ఏర్పడకుండా సహాయక చర్యలు సక్రమంగా జరిగే విధంగా చూస్తుంది. ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి అధునాతన రక్షణ టెక్నిక్‌లు, పరికరాల వినియోగం, వివిధ రకాల విపత్తుల్లో స్పందించాల్సిన తీరుపై నిరంతరంగా శిక్షణ ఇస్తుంటారు. విపత్తుల సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాగృతం చేయడం కూడా విధుల్లో భాగంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు దళాల నుంచి సామర్థ్యం ఆధారంగా ఎంపికచేసి ఎస్‌డీఆర్ఎఫ్‌కి సంబంధించి కఠినశిక్షణ ఇస్తారు. విపత్తుల సమయంలో ఆయా ప్రదేశాల్లో ముందస్తుగా ఈ బృందాలను మోహరిస్తారు. రెవెన్యూ శాఖ వీరి వసతి, సదుపాయాలను చూసుకుంటుంది. సహాయం గురించి ఫోన్‌కాల్ వచ్చిన 10 నిమిషాల్లో సిద్ధమై బయలుదేరుతారు. విపత్తు ప్రదేశాలకు వెళ్లిన తర్వాత ఎవరి ఏ పనిచేయాలనే అంశంపై స్పష్టమైన నిర్దేశం ఉండడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడకుండా సహాయక చర్యలు కొన సాగిస్తారు. వీరివద్ద విపత్తు నిర్వహణ సాధనా సంపత్తితో ఉండే వాహనం గురించి ప్రత్యేకమని చెప్పాలి. ఈ వాహనంలో విపత్తు నిర్వహణకు అవసరమైన అన్ని పరికరాలు/వస్తువులు ఉంటాయి. తిత్లీ తుఫాను సమయంలో వీటిలోని కొన్ని పరికరాల కొరత ఉంటే అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు వాటిని హెలీకాప్టర్లలో పంపించి వాహనాల్లో సమకూర్చారు. మొత్తం సరంజామా తో కలుపుకొని ఈ వాహనం 10టన్నుల బరువు ఉంటుంది.

మొంథా తుఫాన్‌కి ఉమ్మడి జిల్లాలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహరించిన నేపథ్యంలో ప్రత్యేక కథనం.

వాహనంలో ఇవే..

● **ఇన్‌ఫ్లాటబుల్ రబ్బర్ బోట్లు:** వీటిని సులభంగా తరలించవచ్చు. యంత్రంతో గాలి నింపగానే బోటు సిద్ధం అవుతుంది. నీటిలో చిక్కుకున్న వాళ్లను రక్షించడంలో సహాయపడుతుంది. 8 నుంచి 12 వరకూ ప్రయాణించే వీలుంటుంది.

● **చైన్‌సాలు:** బలమైన గొలుసు(చైన్) మాదిరిగా అమర్చి ఉంటే పవర్ సాలు ఇవి. రోడ్లపై చెట్లు పడిన సందర్భంగా తక్కువ వ్యవధిలో వాటిని కట్ చేసి తొలగించడానికి ఉపయోగిస్తారు.

● **హెవీరోప్స్:** లోడు లారీలను సైతం లాగే మందపాటి తాళ్లు. ఒక్కోటి సుమారు 30 మీటర్లు ఉంటుంది. ఇలాంటివి ఈవాహనంలో 5 నుంచి 10 వరకూ ఉంటాయి.



ఎన్‌డీఆర్ఎఫ్ రెస్క్యూ వాహనంతో సిబ్బంది

● **లైఫ్ బాయ్స్:** గుండ్రని ద్విచక్ర వాహనం ట్యూబ్ మాదిరిగా ఉంటాయి. నీటిలోప్రమాదంలో ఉన్న వాళ్లకు వీటిని విసురుతారు. దానిని మెడద్వారా వేసుకుంటే నీటిపై తేలుతూ ఉండొచ్చు.

● **రెస్క్యూ ట్యూబ్స్:** పొడవాటి వెడల్పు ట్యూబులు ఉంటాయి. వీటిలో గాలిని నింపి నీటి లో నుంచి తీసుకురావాల్సిన బాధితుడికి క్లిప్పుల ఆధారంగా అమరుస్తారు. దీంతో అతడు నీటిపై తేలుతూ ఉండగా రెస్క్యూటీం ఒడ్డుకుచేరుస్తుంది. లైఫ్ జాకెట్స్‌ని కోటు మాదిరిగా వేసుకుంటే నీటిలో మునగడం ఉండదు. త్రోబ్యాగ్స్ ఇలాంటివే. ఆ బ్యాగు తాడు అమర్చి ఉంటుంది. బ్యాగ్‌ని బాధితుడు ఒకవైపు పట్టుకోవడం, నడుముకి కట్టుకోవడంచేస్తే తాడుతో ఒడ్డుకు చేరుస్తారు.

● **గొడళ్లు:** పదునైన పెద్ద పెద్ద గొడ్డళ్లు ఉంటాయి. ఒకవేళ పవర్ రంపాలను ఉపయోగించే పరిస్థితి లేకపోతే వీటితో కట్ చేస్తారు. విద్యుత్ వైర్లను విద్యుత్ ప్రవాహం ఉండగానే వీటిలో కట్ చేయవచ్చు. వీటికి ఉండే పిడి ఇన్సులేటర్(షాక్‌ప్రూఫ్) మాదిరిగా పనిచేస్తుంది. పెద్ద సుత్తులు కూడా ఉంటాయి.

● **స్ప్రెడ్డర్ కట్టర్:** ఇనుప తలుపులు వంటి వాటికి పెద్దరంధ్రం పెట్టడానికి ఉపయోగిస్తారు. కారు ప్రమాదం జరిగి డోర్లు రాకపోతే డోరు బలవంతంగా ఊడతీయడానికి సమయం పడుతుంది. అలా కాకుండా డోరుకు పెద్ద రంధ్రం చేయడం ద్వారా బాధితులను తక్కువ సమయంలో బయటకు తీస్తారు. వాహనంలో ఉండే ఐరన్ కట్టర్లతో ఐరన్ ఊచలు, ప్లేట్లు వంటి వాటిని కట్ చేస్తారు.

● **స్పైన్‌బోర్డ్స్,స్ట్రెచర్స్:** బాధితులను అంబులెన్సులలోకి, మెడికల్ క్యాంపులకు తరలించడానికి, ప్రథమ చికిత్స అందించడానికి ఉపయోగిస్తారు.

● **స్కూబా, స్కాబా సూట్స్:** నీటిలో లోతుకు వెళ్లడానికి స్కూబా, రసాయన విపత్తులు జరిగిన సమయంలో, పొగ కమ్ముకొన్నప్పుడు బాధితులను రక్షించడానికి స్కాబాసూట్లు ఉపయోగపడతాయి.

● **వీఎల్‌సీ:** విక్టిం లోకేటింగ్ కెమెరాను వీఎల్‌సీ అంటారు. భవనాలు కూలిన సమయంలో శిథిలాల కింద ఏమున్నాయో చూడడానికి ఇది ఉపకరిస్తుంది. ఒక గొట్టం ద్వారా దీనిని పంపించి శిథిలాల కింద పరిస్థితిని అంచనా వేస్తారు. అక్కడ చిక్కుకున్న బాధితులను రక్షించడంలో ఎక్కువగా ఉపయోగిస్తారు.

ప్రత్యేక ప్రోత్సాహం నిల్

విపత్తు వేళ బయట పడడానికి అందరూ పరుగులు పెడితే.. విపత్తుకు ఎదు రెళ్లి బాధితులను రక్షించే విధుల్లో ఎన్‌డీ ఆర్ఎఫ్ పని చేస్తుంది. ఈ క్రమంలో ఈ సిబ్బంది ప్రమాదాలే కాకుండా వ్యాధుల బారిన కూడా పడుతూ ఉంటారు. భోజనం చేసే సమయంలో ఫోన్ వస్తే తినడం ఆపేసి తక్షణమే బయలుదే రాల్సిన పరిస్థితులు ఉంటాయి. తిరిగి ఎప్పుడు ఇళ్లకు చేరుకుంటారో కూడా తెలియదు. అలాంటి విధుల్లో ఎన్‌డీఆర్ ఎఫ్ సిబ్బందికి ప్రత్యేక ఎలవెన్సులు లేకపోవడం వారిని ఆవేదనకు గురి చేస్తోంది. పోలీస్ విభాగాల్లో కొన్నిటికి ఉదాహరణకు ఈగిల్‌కి 30%, మహిళా పోలీస్ స్టేషన్ 30% ప్రత్యేక ఎలవెన్సు కింది చెల్లిస్తారు. అలాగే ఎన్‌డీఆర్ఎఫ్‌కి కూడా ఇవాల్సిన అవసరం ఉంది.

ఎన్‌డీఆర్ఎఫ్

జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీ ఆర్ఎఫ్)ను విపత్తు నిర్వహణ చట్టం-2005 ప్రకారం 2006లో ఏర్పాటు చేశారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పని చేస్తోంది. భూకంపాలు, వరదలు, తుఫాన్‌లు, భవనాలు కూలిపోవడం, కొండచరియలు విరిగిపడడం వంటి విపత్తు సమయంలో బాధితులను రక్షించడంలో సహాయం చేస్తుంది. న్యూకియర్ విపత్తుల సమయంలో కూడా ఈ ఫోర్స్ రంగంలోకి దిగుతుంది. ఈదళాల్లో సుశిక్షితులైన సీఆర్పీఎఫ్ తదితర పారా మిలిటరీ పోలీసులు ఉంటారు. వీరికి ప్రత్యేక ఎలవెన్సులు కూడా ఉంటాయి.

అవయవదానంతో నలుగురికి జీవదాత

● గ్రీన్‌ఛానెల్ ద్వారా వేర్వేరు ప్రాంతాలకు తరలింపు



గ్రీన్‌ఛానెల్ ద్వారా అవయవాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధమైన దృశ్యం

సామర్లకోట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్‌తో ప్రాణాలు కోల్పోయిన ఒక యువకుడు తన అవయవాలను దానంచేసి మరో నలుగురికి ప్రాణదానంతో జీవదాతగా నిలిచాడని కాకినాడజిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులోని కొప్పవరంవద్ద గల మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ శుభాకరరావు వెల్లడించారు. బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఈమేరకు జీవదాత వివరాలను తెలియజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అమలాపురానికి చెందిన జి.మహేష్ అనే యువకుడు ఈనెల 26న అర్ధరాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మెరుగైన చికిత్స కోసం సదరు యువకుడిని కొప్పవరం మెడికవర్ ఆసుపత్రికి తీసుకురాగా మెడికవర్ వైద్యులు ఎంతమేర వైద్యం అందించినా యువకుడి బ్రెయిన్ ఎంతమాత్రం స్పందించకపోవడంతో 27న వైద్యబృందం యువకుడిని బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారన్నారు. ఈ నేపథ్యంలో యువకుడి తల్లిదండ్రులు అవయవదానంపై అవగాహన ఉండడంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ కుమారుడి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారన్నారు. జీవన్‌దాన్ అనుమతులతో మెడికవర్ హాస్పిటల్స్ వైద్యబృందం తమ హాస్పిటల్‌లోనే అవయవ సేకరణ కార్యక్రమం నిర్వహించారన్నారు. కాకినాడజిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఫోరెన్సిక్ మెడిసిన్ డాక్టర్ పి.ఫణికిరణ్ పర్యవేక్షణలో డాక్టర్ కళ్యాణ్‌బాబు, డాక్టర్ రాజా అమరేంద్ర, డాక్టర్ కిషోర్‌బాబు, డాక్టర్ అరవింద్‌లు క్రిటికల్ కేర్ హెచ్‌వోడీలు, మెడికవర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ టీమ్, సమన్వయంతో అవయవాలను సేకరించారన్నారు. సేకరించిన అవయవాలను గ్రీన్‌ఛానెల్ ద్వారా అవసరమైన అనుపత్రులకు యుద్ధప్రాతిపదికన తరలించి నలుగురికి కొత్తజీవితం అందించారన్నారు. జీవన్‌దాన్ ప్రతినిధి డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ అవయవదానం అనేది జీవితానికి పరమార్థం. ఒకరి జీవిత ప్రయాణం ముగిసినా ఆయన అవయవాలు మరెందరికో కొత్త శ్వాసగా మారతాయన్నారు. ఇది కేవలం దాతృత్వం కాదు సమాజానికి మనం అందించే విలువైన బహుమతిగా అభివర్ణించారు. అంతేకాదు మరొకరికి కొత్తజీవితం అన్నారు. ఇలాంటి దాతృత్వ నిర్ణయాలు సమాజంలో జీవం నింపుతాయని పేర్కొంటూ అవయవదానం చేసేందుకు ముందుకువచ్చి నలుగురికి జీవదాతగా మారేందుకు ప్రోత్సహించిన యువకుడి తల్లిదండ్రులను సెంటర్ హెడ్ శుభాకరరావు అభినందించారు.

శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో

సప్త నదీ జలాభిషేక మహోత్సవాలు ప్రారంభం



శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి



పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో పల్లకీ సేవ, సప్త నదీ జలాలకు పూజ చేస్తున్న ఈవో సౌజన్య

పిఠాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో పీఠాధిపతి సజ్జనగడ రామస్వామి ఏకోత్తర శత జయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీపాదశ్రీవల్లభ స్వామికి మూడు రోజులు నిర్వహించే సప్త నదీ జలాభిషేక మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరణ, శ్రీపాదులకు దత్తాత్రేయ మూలమంత్ర పాశుపతాభిషేకం జరిగాయి. మధ్యాహ్నం అగ్నిప్రతిష్ఠాపన, లక్ష్మీగణపతి సహిత రుద్రహోమం, దత్త మూలమంత్ర హోమం నిర్వహించారు. ఉదయం పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయంలో సప్త నదీ జలాలకు ఈవో ఆర్.సౌజన్య పూజలు చేశారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతిలను పుష్పాలతో అలంకరించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

'మొంథా' ముంచేసింది!

మొంథా తుఫాన్ బీభత్సం సృష్టించింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భారీ ఈదురుగాలులకు భారీ వృక్షాలు, కొబ్బరి చెట్లు పేకమేడల్లా కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. ఆ చిత్రాలే ఇవి


బిక్కవోలు మండలం ఊలపల్లిలో నేలకొరిగిన వరి పంట


ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో దెబ్బతిన్న పత్తి పంట


పెరవలి మండలం కాకరపర్రు వద్ద నేలవాలిన అరటి గెలలు


కోనసీమ జిల్లా అంతర్వేదిలో నీట మునిగిన గృహాలు


అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో నేలకొరిగిన తాటి చెట్టు


ఉప్పాడలో రహదారిపై కూలిన వృక్షం


రాజవొమ్మంగి మండలం దూసరిపాము గ్రామ శివారులో రోడ్డుపై పడిన చెట్టు


మామిడికుదురు మండలం గెద్దాడలో నేలనంటిన వరిచేలు


మలికిపురం మండలం తూర్పుపాలెంలో నేలకొరిగిన చెట్లు


రాజమహేంద్రవరంలో చెట్ల కొమ్మల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా


గోకవరం మండలం గాదెలపాలెంలో నేలకొరిగిన వరి పంట


దేవరపల్లి మండలం పల్లంట్లలో పడిపోయిన బొప్పాయితోట


కె.గంగవరం మండలం పామర్రులో పడిపోయిన వరి పొలం


శంఖవరం మండలం కత్తిపూడిలో కూలిన ఇల్లు


ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పరిశీలిస్తున్న ఎంపీ సతీష్, ఎమ్మెల్యే సత్యప్రభ

'ఏలేరు'లో పెరిగిన నీటి నిల్వలు

దిగువకు 4900 క్యూసెక్కుల విడుదల

ప్రాజెక్టును పరిశీలించిన ఎంపీ సతీష్, ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో కాకినాడ జిల్లా ఏలేశ్వంలోని ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా జలాశయం నుంచి దిగువకు 4900 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో మరో 2 టీఎంసీలు నీటిని నిల్వచేసే అవకాశం ఉంది. దీంతో ప్రాజెక్టులో బుధవారం నాటికి 86.56 మీటర్లకుగాను 85.35 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 21.66 టీఎంసీలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కుల నీటిని, దిగువ ప్రాంతాలకు 4900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఏలేరు జలాశయాన్ని రాజ్యసభ ఎంపీ ఎంపీ సానా సతీష్‌బాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాజెక్టులోని వివిధ గ్యాప్‌లను పరిశీలించారు. ఏలేశ్వరం- అప్పనపాలెం మధ్య ఏలేరు ప్రధాన కాలువపై కుంగిన వంతెనను పరిశీలించారు. కాజ్‌వే నిర్మాణం చేపట్టే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీ స్థానికులకు హామీ ఇచ్చారు. ఏలేరు ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఏలేరు ప్రాజెక్టు ఛైర్మన్ బస్వా వీరబాబు, తోట నవీన్, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్థిరంగా వరద ఉధృతి

పిఠాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) ఏలేరు వరద ఉధృతి స్థిరంగా కొనసాగుతోంది. రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను తగ్గించినప్పటికీ కాకినాడ జిల్లా పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో నీటి ఉధృతి మాత్రం తగ్గలేదు. ఏలేరు రిజర్వాయర్‌కు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి ఇన్‌ఫ్లోస్ గణనీయంగా పెరిగాయి. ఇన్‌ఫ్లోస్ మరింత పెరిగితే నీటి విడుదలను పెంచే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.


గొల్లప్రోలు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు

ఇంటి నుంచి బయలుదేరి.. గోదావరిలో శవంగా తేలి..

మృతదేహంపై కత్తి గాయాలు

తన భర్త మృతికి ఐదుగురు కారణమని భార్య ఆరోపణ


అమలాపురం పోలీసుస్టేషన్ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న మృతుడి భార్య దేవి


ఫైల్‌ఫొటో


శ్రీనివాస్ మృతదేహం

అమలాపురం టౌన్/పి.గన్నవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి రాజమహేంద్రవరం బయలు దేరిన ఓ వ్యక్తి కొన్నిరోజుల తర్వాత గోదావరిలో శవంగా తేలాడు. అయితే తన భర్త ఆచూకీ తెలపాలంటూ భార్య, బంధువర్గీయులతో కలిసి బుధవారం అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగింది. భర్త అదృశ్యం వెనుక ఐదుగురు వ్యక్తులు ఉన్నారని మీడియాకు చెప్పింది. ఈ సంఘటన జరిగిన గంటల వ్యవధిలోనే భర్త మృతదేహం లభ్యమైంది. ఇందుకు సంబంధించి అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు, పి.గన్నవరం ఎస్‌ఐ శివకృష్ణ తెలిపిన సమాచారం ఇలా ఉంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మం డ లం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) ఈనెల 25న ఇంటి నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం వెళ్తున్నట్టు భార్య కంచిపల్లి దేవి తెలిపాడు. భర్త తిరిగి రాకపోవడంతో అన్నిచోట్లా గాలించి చివరకు ఈనెల 27న అమలాపురం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంటి నుంచి సుజుకీ మోటారుసైకిల్‌పై బయలుదేరిన శ్రీనివాస్ భార్యతో సాయంత్రం వరకు 3సందర్భాల్లో ఫోన్‌లో మాట్లాడాడు. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్‌లోకి వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలో గోదావరిలో బుధవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆ సమాచారాన్ని ఎస్‌ఐ శివకృష్ణ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి చేతులపై ఎరుపురంగు తాడుతో పాటు కుడిచేతిపైన రుషి, దేవి, వినీత్ అని ఆంగ్ల అక్షరాలతో టాటూలు ఉన్నాయి. హీరో చిరంజీవితో పాటు ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్ టాటూ కూడా మరో చేతిపై ఉంది. దాంతో సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు మృతుడి సోదరుడు అంజితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇది శ్రీనివాస్ మృతదేహమే అని అంజి నిర్ధారించాడు. దాంతో ఈ కేసును అమలాపురం పోలీసుస్టేషన్‌కు బదలాయించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. డీకంపోజ్ అయిన మృతదేహంపై పలుచోట్ల కత్తితో పొడిచిన గాయాలు ఉన్నట్టు గుర్తించారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబానికి అందజేశారు. తన భర్త మృతికి అమలాపురానికి చెందిన ప్రముఖ వ్యాపారి గంగుమళ్ల కాసుబాబు, శంకర్, భాస్కర్ల ప్రసాద్, సలాది అప్పన్న, రావులపాలెనికి చెందిన అనిల్ కారణమని మృతుడి భార్య దేవి ఆరోపించింది. పోస్టుమార్టం నివేదిక అందిన తరువాత గానీ తాము ఏమీ చెప్పలేమని పట్టణ సీఐ వీరబాబు తెలిపారు.

రాత్రి ఇంటిలో నిద్రించి... ఉదయం శవంగా కనిపించి!

తుఫాన్ గాలులకు వ్యక్తి మృతి


మరణించిన ఈతకోట శ్రీరాములు

ఉప్పలగుప్తం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం టి.చల్లపల్లి పంచాయతీ పర్రపేటలో బుధవారం ఉదయం ఈతకోట శ్రీరాములు (73) తన ఇంటి ముందే తోటలో శవమై కన్పించాడు. మంగళవారం రాత్రి శ్రీరాములు తన గదిలో పడుకున్నాడు. అర్ధరాత్రి మూత్ర విసర్జన నిమిత్తం బయటకు వచ్చి తుఫాను గాలుల బీభత్సానికి మృతిచెందినట్టు కుటుంబసభ్యులు చెప్తున్నారు. అయితే ఈ విషయంపై పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు గ్రామ సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో వ్యక్తి మృతి

అంతర్వేది, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టారు. అయితే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్న ప్రైవేటు వ్యక్తి యడ్ల సత్యశివశంకర్ (44) విద్యుదాఘాతంతో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. రాజోలు మండలానికి చెందిన శంకర్ గత పది సంవత్సరాలుగా సఖినేటిపల్లిలో ఉంటూ అప్పుడప్పుడు అవసరం మేరకు విద్యుత్ అధికారులకు హెల్పర్‌గా పనులు చేస్తుంటాడు. అలాగే మొంథా తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ పోల్‌పై పనిచేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ దుర్గాశ్రీనివాస్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

కాకినాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని ఆర్థిక ఇబ్బందులు కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా ఇంద్ర పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం...కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెనికి చెందిన కందుకూరి రాజు అతడి కుమారుడు నరేంద్రస్వరూప్(17) కూలీపనులు చేస్తుంటారు. గత కొంతకాలంగా కుటుంబసభ్యులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. దీంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో నరేంద్రస్వరూప్ ఉరి వేసుకుని మృతిచెందాడు. ఈ మేరకు అతడి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉప్పుటేరు కాలువలో తేలిన బాలుడి మృతదేహం


(ఫైల్ ఫొటో)


చరణ్‌సాయి మృతదేహం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యారావుపేట పర్రకాలువలో ఈనెల 27న గల్లంతైన పోలవరపు చరణ్‌సాయి రిత్విక్ (11) మృతదేహం బుధవారం స్థానిక హరిత రీసార్టు సమీపంలో ఉప్పుటేరులో తేలిఉండటాన్ని పోలీసులు గుర్తించారు. కాకినాడ మధురానగర్‌కి చెందిన చరణ్‌సాయి రిత్విక్ సోమవారం మేనమావయ్య కొప్పిశెట్టి శ్రీనివాస్‌తో కలసి బైక్‌పై నేమాం వెళ్లేందుకు సూర్యారావుపేట పర్రకాలువ కాజ్‌వేపై వెళ్తూ ఉప్పుటేరులో పడిపోవడంతో గల్లంతైన సంగతి విదితమే. బాలుడి ఆచూకీ కోసం తిమ్మాపురం ఎస్‌ఐ వై.గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌కు చెందిన ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో గత 2 రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు చరణ్‌సాయి రిత్విక్ మృతదేహం ఎన్టీఆర్ బీచ్ సమీపంలో ఉన్న హరిత రీసార్టు వెనకాల గల ఉప్పుటేరులో తేలియాడుతూ ఉండడాన్ని గుర్తించారు. పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి, అక్కడ శవ పంచనామా చేసిన అనంతరం బంధువులకు అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రెండు బైకుల ఢీ

ఇద్దరికి గాయాలు

శంఖవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు మలుపులో రెండు బైకులు ఢీ కొన్నాయి. బుధవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన అప్పన రాంబాబు, గరగ పండు ఎదురెదురుగా బైక్‌లపై వస్తూ మలుపులో ఒకరినొకరు ఢీకొన్నారు. ఇద్దరూ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. రోడ్డుకి ఇరువైపులా తుప్పలు పేరుకుపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కొండచిలువ హల్‌చల్..




వలలో చిక్కుకున్న కొండచిలువ

ఉప్పలగుప్తం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేటలో బుధవారం కొండచిలువ హల్‌చల్ చేసింది. వలలో చిక్కుకుని బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికుల కంటపడింది. సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు సమాచారాన్ని పోలీసు, అటవీశాఖ సిబ్బందికి తెలియజేశారు. వారు వచ్చేలోగానే స్థానికులు కొండచిలువను హతమార్చారు.

కాలువలో యువకుడి మృతదేహం లభ్యం


నాగరాజు (ఫైల్)

అంబాజీపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బహిర్భూమి వెళ్లి ప్రమాదవశాత్తు మురుగుకాలువలో పడి యువకుడు మృతిచెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి శివారు తురకలదొడ్డికి చెందిన గుబ్బల నాగరాజు(35) ఈ నెల 28న సైకిల్‌పై బహిర్భూమికి వెళ్లాడు. ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. గ్రామానికి సమీపంలో ఉన్న మురుగు కాలువలో నాగరాజు శవమై కనిపించాడు. మృతుడి భార్య లక్ష్మీనాగప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాగరాజు మృతదేహాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరిశీలించి నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర జలవనరుల శాఖ డైరక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ అరిగెల సూరిబాబు, టీడీపీ నాయకులు దాసరి వీర వెంకట సత్యనారాయణ, పళ్ల శ్రీనివాసరావు, యనమదల సాయిబాబు తదితరులున్నారు.

అనపర్తిలో అగ్నిప్రమాదం

షార్ట్ సర్క్యూట్‌తో పేలిన ఫ్రిజ్ సిలెండర్

అనపర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి శివారు కొత్తూరు జగనన్న కాలనీలో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. కాలనీలో నివసిస్తున్న కుక్కల దుర్గాభవాని తన ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటుంది. బుధవారం సాయంత్రం ఆమె ఇంటి నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు తలుపులు పగులగొట్టి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఇంతలోనే ఒక్కసారిగా ఫ్రిజ్ సిలండర్ పేలడంతో ఆ ప్రాంతమంతా భయందోళనలకు గురయ్యారు. స్థానికులు తలుపులు పగులగొట్టి మంటలను అదుపు చేశారు. అనపర్తి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని నష్టం అంచనా వేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ. 50 వేల వరకు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేస్తున్నామని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.




ప్రమాదం జరిగిన ఇంటి నుంచి వస్తున్న పొగలు, పేలిన ఫ్రిజ్ లోపల సిలెండర్

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి



మత్స్యకార కుటుంబాలకు నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

సమర్థవంతంగా తుఫాన్‌ను ఎదుర్కొన్నాం

● నిత్యావసరాల పంపిణీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తూపాన్‌ను సీఎం చంద్రబాబు ముందస్తు ఆలోచన ప్రణాళికలతో అధికార యంత్రాంగం సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పునరావాస చర్యలు సకాలంలో చేపట్టి ప్రాణ, ఆస్తినష్టాలు లేకుండా చూడగలిగామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు అన్నారు. బుధవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో నగరంలోని పునరావాస కేంద్రాలను ఆదిరెడ్డి వాసు పరిశీలించారు. ఎంత మంది వచ్చారు. ఆహారం అందిందా లేదా అనేది ఆరా తీశారు. ఉదయం కోటిలింగాలపేటలోని వంద మత్స్యకార కుటుంబాలకు భవానీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పదికేజీల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పంచదార, ఆయిల్ ప్యాకెట్‌తో కిట్లను వాసు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మొంథా తుఫాన్‌పై రాష్ట్ర విపత్తునిర్వహణ సంస్థ అప్రమత్తం చేసినప్పుడు వెంటనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్ర అధికార యంత్రాగాన్ని జాగృతం చేశారని, దీంతో తాను, రాజమహేంద్రవరంలో కూటమి నాయకులు, అధికారులు కలిసి సమన్వయంతో 36 గంటలపాటు కష్టపడి పునరావసచర్యలు తీసుకున్నామన్నారు. ఈసందర్భంగా అధికారులకు అభినందనలు తెలిపారు. ఇంత కష్టపడి అధికారులు పనిచేస్తే నగరంలో ఒక్క చెట్టు ఊగడంలేదని కదలడంలేదని వైసీపీ నాయకులు చిల్లర రాజకీయాలు చేశారని, తుఫాన్ ప్రభావం లేదని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు సమర్థతకు ఇదొక నిదర్శనం

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):మొంథా తూపాన్‌కు ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారని ఇది సీఎం చంద్రబాబు సమర్థతకు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. ఈమేరకు తన కార్యాలయంలో బుధవారం గన్నికృష్ణ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితిని పరిశీలించి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాలోకేష్‌లు తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలు చాలా నష్టాలను జరుగకుండా చేశాయన్నారు. అధికారులకు, కూటమి నాయకులు ఆయన అభినందనలు తెలిపారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్ రాహుల్‌మీనా



తుఫాన్‌లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికుడిని అభినందిస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తూపాన్‌తో రహదారులను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా అభినందించారు. బుధవారం వేకువజామున నగరంలో పర్యటించిన ఆయన స్థానిక వీఎల్ పురం ప్రాంతంలో జోరువానలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. వారి సేవలను అభినందించారు. పారిశుధ్య సిబ్బంది భద్రత కోసం అందజేసిన వ్యక్తిగత రక్షణ కిట్స్ ఉపయోగించడంతోపాటు వర్షంలో రెయిన్‌కోట్లను తప్పనిసరిగా ధరించాలని కమిషనర్ సూచించారు. నగరంలో కురుస్తున్న వర్షాలదృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పారిశుధ్య నిర్వహణ మరింత పకడ్బందీగా చేపట్టాలన్నారు. అనంతరం పలు చోట్ల కూలిన చెట్ల తొలగింపు పనులు పర్యవేక్షించారు.

'ఆదిత్య' విద్యా సంస్థల చైర్మన్‌కు జీవిత సాఫల్య పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న కనకరాజు

గోకవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గోకవరం మం డలం కొత్తపల్లి ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ ప్రగళ్ళపాటి కనకరాజు జీవిత సాఫల్య పురస్కార అవార్డును అందుకున్నారు. పుదుచ్చేరిలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు కార్యక్రమంలో విద్యా విభాగంలో ఆయన పుదుచ్చేరి పబ్లిక్‌వర్క్ శాఖామంత్రి ధీరుకే లక్ష్మీనారాయణన్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ ఈగౌరవం దక్కడం వెనుక తమ సంస్థలకు చెందిన అధ్యాపకులు, కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉందన్నారు. ఈసందర్భంగా కనకరాజును ఆదర్శకళాశాల కోఆర్డినేటర్ ప్రగళ్ళపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ త్రినాధరావు, వైస్ ప్రిన్సిపాల్ సుజిని, తదితరులు అభినందించారు.

విపత్కర పరిస్థితిలో కార్పొరేట్ హాస్పటల్స్‌లో ఆరోగ్యశ్రీ లేదు

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను ప్రభుత్వాధికారులు సమర్థవంతంగా ఎదుర్కొన్నందుకు అభినందనలు తెలుపుతున్నామని, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కార్పొరేట్ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు లేకుండా చేయడం చాలా బాధాకరమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా, వైద్యం విషయంలో ఇబ్బందులు పెడితే ప్రజలు క్షమించారని గతంలో మాజీ సీఎం జగన్ కూడా ఇలాగే నిర్లక్ష్యం చేసి సర్వనాశనం చేశాడని విమర్శించారు. ఇప్పుడు సియం చంద్రబాబు కూడా విద్యవైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల చేయడం, ఫీజు రియంబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో ప్రజల్లో తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాద్ విజయవంతం చేయండి

● ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు



రంగంపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నవంబరు 1వ తేదీన ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తల పెట్టిన దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీలో అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంఎస్పీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కొడమంచిలి వెంకట్రావు పిలుపునిచ్చారు. జిల్లాలో మండలాల పర్యటనలో భాగంగా బుధవారం రంగంపేట మండలంలో ఎస్టీరాజాపురం, వడిశలేరు, ఈలకొలను గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయిపై జరిగిన బూటు దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేయాలంటూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో తలపెట్టిన దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీలో మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరి రవికుమార్, నాయకులు కుందేటి వెంకటరమణ,పల్లేటి శేఖర్,ఉండ్రాసి జ్యోతి,రాము,రమేష్, శ్రీను పాల్గొన్నారు.



కడియంలో పడిపోయిన మొక్కలు



పడిపోయిన వరిచేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



పందలపాకలో మొలకలు వచ్చిన వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



రాజానగరంలో వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల



వంగలపూడిలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న బీవీఆర్ చౌదరి

ముంచేసిన మొంథా

● సహాయక చర్యల్లో అధికారుల బృందం, ఎమ్మెల్యేలు ● తుఫాన్ దెబ్బతో కుదేలైన రైతన్న

● అనపర్తి నియోజకవర్గంలో 150 కోట్ల పంట నష్టం : ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో అనపర్తి నియోజకవర్గంలో సుమారు 150కోట్ల పంట నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. మొంథా తుఫాన్ తీరం దాటిన నేపథ్యంలో బుధవారం ఆయన అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, పెదపూడి, బిక్కవోలు రంగంపేట మండలాల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యంగా అనపర్తి, పెదపూడి, రంగంపేట మండలంలో వరిపంటకు నష్టం వాటిల్లగా రంగంపేటలో మినుముపంట విపరీతంగా నష్టపోయిందన్నారు. అధికారులు రైతు పక్షపాతిగా వ్యవహరించి నివేదికలు పంపిస్తే తాను ముఖ్యమంత్రితో చర్చించి రైతులకు తగిన సహాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. మొంథా తుఫాన్ ముప్పు తప్పినప్పటికీ అనపర్తి మండలంలో తుఫాన్ రైతులను నిండా ముంచింది, తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందని అంచనా వేయడంతో మంగళవారం రాత్రి ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. తెల్లవారు జామున వీచినగాలుకు పీరా రామచంద్రపురంలో తాటిచెట్లు నేలకొరిగాయి. పలు గ్రామాల్లో, చెట్లు, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఉదయం నుంచి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్ని మండలాల్లోను పర్యటిస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనపర్తిలో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టారు. ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో విరిగిపడిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించడంతో సమస్యలు తలెత్తలేదు. అనపర్తి మండలంలో సుమారు 9.5వేల ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 7వేల ఎకరాల్లో వరి పంట నేలనంటింది.

మహేంద్రవాడలో వరి పంటల పరిశీలన

మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులు అందోళన చెందవద్దని ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మొంథా తుఫాన్‌తో అనపర్తి మండలం మహేంద్రవాడలో నేలనంటిన వరి పొలాలను ఆయన బుధవారం పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నేలనంటిన వరిలో ఇప్పటికే మొలకలు వచ్చిన వరి కంకులను ఎమ్మెల్యేకు చూపుతూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించాలని లేకుంటే తాము పూర్తిగా అన్యాయం అవుతామని కోరారు. దీనిపై ప్రభుత్వం ఆలోచన చేస్తుందని రైతులు ఆందోళన పడవద్దని ఎమ్మెల్యే సూచించారు.

● అనపర్తి మండలం మహేంద్రవాడలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకుని వారికి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. అదే విదంగా వృద్ధులకు అందుతున్న వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు.

మొలకెత్తిన మినుము పంట పరిశీలన

రంగంపేట(ఆంధ్రజ్యోతి): మండలంలో గత మూడు రోజులుగా కురిసిన భారీవర్షాలకు రైతులకు తీరనినష్టం వాటిల్లిందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బు ధవారం రంగంపేట మండలంలో గల చంద్రేడు, పెదరాయవరం, రంగంపేట గ్రామాలలో నేలకొరిగిన వరి పంటలను, తడిచి మొలకలు వచ్చిన మినుము పంటను ఆయన పరిశీలించారు. రైతులను కూటమి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. ఈదురు గాలులకు 432 హెక్టార్లలో వరి పంట నేలకు ఒరిగిందని 432 హెక్టార్లలో వరి ,777 హెక్టార్లలో పంట దెబ్బతినవచ్చని ప్రాథమిక అంచనా వేసినట్లు రంగంపేట మండల వ్యవసాయశాఖాధికారి కె.శ్రీనివాసరావు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి వివరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రదానకార్యదర్శి అళ్ళ గోవిందు, ఆత్మకమిటీ ఛైర్మన్ వెలుగుబంటి సత్తిబాబు, మండల అధ్యక్షుడు ఉద్దండ్రావు శ్రీనివాసరావు, కూటమి నాయకులు మద్దిపూడి సత్తిబాబు, మోదుకూరి గోపాలకృష్ణ, తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతును ఆదుకుంటాం

బిక్కవోలు(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన ప్రతిరైతును ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని పందలపాక, ఊలపల్లి, బలభద్రపురం గ్రామాల్లో నేలకొరిగిన వరి పంటను పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు రైతులు గతవారం రోజులుగా పంట నేలకొరగడంతో ధాన్యం నుంచి వచ్చిన మొలకలను ఎమ్మెల్యేకు చూపించి తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో ఆయన స్పందించి మండలంలో 6551 ఎకరాల్లో వరి నేలకొరిగిందని, కొన్నిచోట్ల ధాన్యం మొలకలు వస్తున్నాయన్నారు. ఇంకో రెండు రోజులు వాతావరణం ఇలాగే వుంటే 90 శాతం పంట నుంచి మొలకలు వచ్చే ప్రమాదముందన్నారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు పడాల వెంకటరామారెడ్డి, ఎంపీపీ తేతలి సుమ, ఏఎంసీ ఛైర్ పర్సన్ జుత్తుక సూర్యకుమారి, కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి, రావాడనాగు, సర్పంచ్ బుంగా రామారావు, ప్రత్యేకాధికారిశ్రీదేవి, అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ, తహసీల్దార్ సత్యకృష్ణ, ఎంపీ డీవో శ్రీనివాస్, ఏవో శామ్యూల్‌జాన్ పాల్గొన్నారు.

892 ఎకరాల్లో నేలకొరిగిన వరిపంట

గోకవరం(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురు గాలులు, కురిసిన వర్షాలు రైతన్నలను కష్టాలలోకి నెట్టాయి. తుఫాన్ ప్రారంభం నుంచే రైతులకు కంటిమీద కునుకు కరువైంది. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సూచనలు చేసినా ప్రస్తుత పరిస్థితులు పంటలను కాపాడుకునే పరిస్థితి కనిపించలేదని రైతులు వాపోతున్నారు. మండలంలో సుమారు 6వేల హెక్టార్లలో వరి పంట సాగుచేయగా కొన్నిరోజుల క్రితం సుమారు 60 హెక్టార్లలో వరికోతలు జరిగాయి. మిగిలిన పంట పొట్ట దశలో ఉంది. సుమారు 20రోజుల్లో కోతలు పూర్తయ్యేవి. ఇంతలో తుఫాన్ రావడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలంలో ముంథా తుఫాన్ కారణంగా 892 ఎకరాల్లో వరి పంట నేలకొరిగినట్లు, మరో 132 ఎకరాల్లో పంట నీటి మునిగినట్లు కోరుకొండ వ్యవసాయ సహాయ సంచాలకురాలు శిశుబిందు తెలిపారు. నేలకొరిగిన వరి పంటపై ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేయాలని ఆమె రైతులకు సూచించారు. తంటికొండ, గాదెలపాలెం, గోకవరం, కొత్తపల్లి, రంప యర్రంపాలెం, గుమ్మళ్ళదొడ్డి, తదితర గ్రామాలలో పంట నేలకొరిగింది. మరికొన్ని గ్రామాలలో పొలాల నిండా వర్షపు నీరు నిలిచిపోయి ఉంది. అచ్చుతా పురం, ఇటికాయి లపల్లి గ్రామాలలో తాటాకిళ్లు నేలకొరిగాయి. జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇన్‌చార్జి వీణాదేవి వెదురుపాక, గుమ్మళ్ళదొడ్డి గ్రామాలలో ఆకస్మిక తనిఖీ చేశారు.

నేలకొరిగిన వరి, తమలపాకు, అరటి

కడియం(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా రైతు కుదేలయ్యాడు. మరో 10 రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న వరి రైతులతోపాటు ఉద్యానపంటలైన తమలపాకు, అరటి పంట నేలమట్టమై రైతు నష్టాలపాలయ్యాడు. దీంతోపాటు ప్యాకెట్లలో ఉన్న పొడవైన నర్సరీ మొక్కలు గాలికి పడిపోయా యి. వీరవరంలో ఆంజనేయస్వామి ఆలయం వెనుక ప్రాంతంలో విద్యుత్ స్తంభం పడిపోయింది. విషయాన్ని ఏఈ రామారెడ్డి దృష్టికి తీసుకెళ్ళడంతో స్పందించి స్తంభం నిలబెట్టివిద్యుత్‌లైన్లు పునరుద్ధరించారు.

● కడియం ఆవ ప్రాంతం పరిశీలన

కడియం ఆవ ప్రాంతంలో ఉన్న వరి పొలాలను రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.కృష్ణనాయక్, జిల్లా వ్యవసాయదధికారి ఎస్. మాధవరావు పరిశీలించారు. నీటిలో మునిగిపోయిన భూముల పరిస్థితి పరిశీలించి రైతులకు కలిగిన నష్టాన్ని అంచనా వేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నానిలు పంట పరిస్థితిని, రైతుల సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు ఉన్నారు. కడియం మండలం ఉద్యానశాఖ అధికారి లావణ్య వివరాల ప్రకారం అరటి 20 హెక్టార్లలోను, హెక్టారు తమలపాకు తోట పడిపోయినట్లు తెలిపారు.

● మొంథా తుఫాన్ ప్రభావంతో కడియంలో పాడైన వరి పొలాలను, కడియం ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని టీడీపీ రాష్ట్ర వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డా. గోరంట్ల రవిరామ్‌కిరణ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదేశానుసారం కూటమి నాయకులతో కలిసి తాము ఆవ ప్రాంతాన్ని సందర్శించామన్నారు. పంట ఎంత మేర పాడైంది అనే విషయాన్ని అధికారులు అంచనా వేయాలని ఎమ్మెల్యే గోరంట్ల దృష్టికి తీసుకెళతామన్నారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షులు వెలుగుబంటి నాని, బీజేపీ మండల అధ్యక్షులు బొర్సు సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు సూరపురెడ్డి జానకీరామ్, చిలుకూరి ప్రభ, ఉండమట్ల ప్ర భాకర్, చిలుకూరి నాగేశ్వరరావు, చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి, తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీవో రమేష్, రైతులు ఉన్నారు.

● మండలంలో పాడైన వరి పొలాలను మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సందర్శించారు. రైతులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మండల వైసీపీ అధ్యక్షులు యాదల స్టాలిన్, వైసీపీ శ్రేణులు ఉన్నారు.

నష్ట పరిహార నివేదికలు సిద్ధం చేయండి

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాజానగరం(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బాధిత రైతులకు భరోసా ఇచ్చారు. నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం మండలంలోని మల్లంపూడి, ఫరిజల్లిపేట, నరేంద్రపురం, తూర్పుగోనగూడెం, ముక్కినాడ, నందరాడ, తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి నీటమునిగిన వరి పొలాలు, నివాసిత గృహాలను సంబంధిత అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరిపంట చేతిక ందివచ్చిన తరు ణంలో మొంథాన్ తుఫాన్ అన్నదాతలను నిలు వునా ముంచిందని, అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఆదుకుంటుందని బాధితులకు భరోసా కల్పించారు. రాజా నగరంలో ఏర్పాటుచేసిన పునరావాస కేం ద్రాలను సందర్శించి, నిర్వాసితులకు అందిస్తున్న వైద్యసేవలు, ఇతర సహాయక చర్యలు గురించి ఆరా తీశారు. పంట నష్ట పరిహారానికి సంబంధించిన అంచనా జాబితా లను త్వరితగతిన సిద్ధంచేసి ప్రభుత్వానికి నివేదించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసా యాధికారి ఎ.కళ్యాణ్ సూర్యకుమార్, ఎంపీడీవో జేపఝాన్సీ, తహసీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతిదేవి, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో పంటలను కాపాడుకోవాలి

● జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమేంద్రవరంరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వివిధ దశలలో వున్న సార్వా వరికి శాస్త్రీయ పద్ధతులు పాటించి పంటలను కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త చల్లా వెంకట నరసింహరావు, కోఆర్డినేటర్ మానుకొండ శ్రీనివాస్ రైతులకు వివరించారు. బుధవారం రూరల్ మండలం తొర్రేడు, వెంకటనగరం, కాతేరు తదితర గ్రామాలలో వర్షాల నేపథ్యంలో నేలకొరిగిన, మునిగిన వరి పంటలను సందర్శించి పంటనష్టం కలుగకుండా ఉండేందుకు పలు యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి భీమరాజు, ఏఈవో పీటర్ వ్యవసాయ సహాయకులు శీనివాస్, సుస్మిత, తేజస్విని పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖకు రూ.5లక్షల నష్టం

బిక్కవోలు(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల విద్యుత్‌శాఖకు రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని బిక్కవోలు విద్యుత్‌శాఖ ఏఈ కె.బుజ్జిదొర బుధవారం తెలిపారు. ఈదురుగాలులకు 11 కేవీ విద్యుత్ స్తం భాలు 17, ఎల్‌టీ స్తంభాలు 6విరిగి పోయాయన్నారు. నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని, విద్యుత్‌వైర్లు పలుచోట్ల తెగిపోయాయని తెలిపారు. తమ సిబ్బందితో కొత్త స్తంభాలు వేసి, వైర్లు సరిచేసి విద్యుత్‌కు అంతరాయం లేకుండా చేశామని ఏఈ వివరించారు.

కూలిన ఇళ్లను పరిశీలించిన హౌసింగ్ పీడీ

రంగాపురం గ్రామంలో మొంథా తుఫాన్ సందర్భంగా వీచిన ఈదురు గాలులకు కూలిన రెండు తాటా కిళ్లను హౌసింగ్ కార్పొరేషన్ పీడీ నాతి బుజ్జి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా కూటమినేతలు వీరికి హౌసింగ్‌లో ఇళ్లు మంజూరు చేయాలని కోరగా అందుకు పీడీ సానుకూలంగా స్పందించారు. కూటమి నేతలు నడింపల్లి చిరంజీవిరాజు, చెల్లే జోష్ బాబు, ఎంపీటీసీ కేతా ఏసురత్నం, పొట్టు సుబ్రహ్మణ్యం, కొండ్రు వెంకన్న, నీలపాల సుబ్రహ్మణ్యం, సిబ్బంది చినబాబు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి పంట

సీతానగరం(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో అధిక వర్షాలుకు తోడు ఈదురు గాలులు వేయడంతో మండలంలోని వరిపంట నేలకు ఒరిగింది. కోతకు వచ్చిన సాంబా మసూరి రకం వరిపంట తుఫాన్ హెచ్చరికలతో కోతలు నిలిపివేశారు. వరి పంటతోపాటు ఉద్యానవన పంటలు అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు సుమారు వంద ఎకరాల వరకు నష్టం కలిగిందని ఉద్యానవన శాఖాధికారులు తెలిపారు అలాగే వరిపంట సుమారు 1300ఎకరాల వరకు నష్టం కలిగిందని ఏవె గౌరీదేవి తెలిపారు.

పంటలను పరిశీలించిన బీవీఆర్ చౌదరి

మొంథా తుఫాన్‌కారణంగా రాత్రి కురిసిన గాలివానకు నేలకొరిగిన పంటచేలను రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణచౌదరి బుధవారం పరిశీలించారు. పంట చేతికందే సమయానికి కురిసిన గాలివానకు వరిపంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆయన వద్ద గోడు వెల్లబుచ్చుకున్నారు. వరి పంట నేలకొరిగి పంటలు పాడయ్యాయని ఈ విషయం అధిష్టానానికి తెలిపి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అనంతరం వంగలపూడి చెరువు వద్ద ఉంటున్న ఎస్టీ కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గద్దే వెంకట కృష్ణ చౌదరి(నల్లి), వలవల రాజా , సింగవరం సర్పంచ్ సంగన పోసియ్య, తదితరులు పాల్గొన్నారు



పునరావాస కేంద్రం వద్ద ప్రజలకు భోజనాలు వడ్డిస్తున్న బత్తుల వెంకటలక్ష్మి

పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సతీమణి

కోరుకొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో మొంథా తుఫాను కారణంగా లోతట్టు ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి భోజనాలు ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. అనంతరం పునరావేస కేంద్రంలో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఏర్పాటు చేసిన వైద్య శిబిరం సందర్శించి నిర్వాసితులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుకున్నారు.. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



జంబూపట్నంలో రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం జంబూపట్నం గ్రామంలో 108 కళశాలతో 108పాలకావిడిలతో, 108 పా లు, పన్నీరు కావిళ్ళతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది.శోభాయాత్రకు ముందు గణపతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి శ్రీవల్లి దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవం బ్రహ్మశ్రీ దీక్షితులు రామకృష్ణ, మర్ల సీతారామశాస్త్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి అయ్యప్ప స్వామివారి పడిపూజా మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ రాజానగరం, జగ్గంపేటకు చెందిన 1108 మంది అయ్యప్ప మాలధార స్వాములు, 108 మంది గురుస్వాములు, ఈ కార్యక్రమాల్లో పా ల్గొని అయ్యప్ప పడిపూజ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బొడ్డువెంకటరమణ చౌదరి, నీరుకొండ వీరన్నచౌదరి, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కంబాల శ్రీనివాసరావు, పలువురు గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. జంబుపట్నం గ్రామానికి చెందిన నాగా శేషగిరి దంపతులు, అడపా సురేష్ దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అనేక గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి పూజల్లో పాలల్గొన్నారు. ఒక ప్రక్క తుఫాన్ సంబంధించి ఈదురుగాలులు, వర్షం పడుతున్నప్పటికీ అయ్యప్ప భక్తులు మొక్కవోని దీక్షతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

400 మందికి అన్నదానం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పుష్కరాలరేవు సెంటర్‌లో రోటరీక్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో తుపాన్ నేపథ్యంలో 400 మందికి అన్నదానం చేశారు. బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం చైర్మన్ డాక్టర్ అంజి దంపతులు, తీగెల రాజా, క్లబ్ అధ్యక్షుడు మండవెల్లి వెంకన్నబాబు, రేఖపల్లి దుర్గాప్రసాద్‌లు పాల్గొని అన్నదానం చేశారు. అన్నదానానికి సహకరించిన డాక్టర్ అంజి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ జోన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎవరూ అధైర్యపడొద్దు : మంత్రి దుర్గేష్ 8
తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

మిమ్మల్ని ఆదుకునేందుకే నేనున్నా



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తుఫాన్ ప్రభావానికి గురైన ప్రాంతాన్ని హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే ద్వారా పొలాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



బెండమూర్లంకలో పొలాలను పరిశీలిస్తున్న సీఎం

- ఓడలరేవు పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులకు సీఎం భరోసా
- రైతులను ఆదుకుంటానని బెండమూర్లంకలో హామీ
- ఓడలరేవులో పర్యటించిన చంద్రబాబు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

తుఫాన్ కష్టాల్లో ఉన్న మిమ్మల్ని ఆదుకోవడానికే నేను ఉన్నా.. అందుకే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోయినా మిమ్మల్ని పలుకరించి ధైర్యం చెప్పాలని వచ్చానమ్మా. మీరెవ్వరూ భయపడొద్దంటూ తుఫాన్ బారినపడిన బాధితులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. మొంథా తుఫాన్ నష్టాలను హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్‌లో బుధవారం మధ్యాహ్నం దిగిన చంద్రబాబుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎంపీ హరీష్‌బాలయోగితోపాటు కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబునాయుడు నేరుగా ఓడలరేవులోని తుఫాన్ షెల్టర్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ షెల్టర్‌లో ఉన్న బాధితులను చంద్రబాబు అందరినీ పలుకరిస్తూ నమస్కరిస్తూ ముందుకు సాగారు. తర్వాత బాధితుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ హెచ్చరికలు తమను ఎంతో భయాందోళనకు గురిచేశాయని, మంగళవారం రాత్రి బతుకు జీవుడా అంటూ భయం గుప్పిట్లో జీవించామని మహిళలు చంద్రబాబు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వారి కష్ట సుఖాలను చంద్రబాబు అడిగి తెలుసుకుని మీరెవ్వరూ అధైర్య పడొద్దు నేనున్నానంటూ వారందరికీ భరోసా ఇచ్చారు. ఆ ప్రాంతంలో తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టాలను అడిగి తెలుసుకున్నారు.




అల్లవరం మండలం ఓడలరేవులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



అల్లవరం మండలం బెండమూర్లంకలో పడిపోయిన వరి చేలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

అనంతరం బాధితులకు 25 కిలోల బియ్యం ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు వంతున ఆర్థికసాయాన్ని చంద్రబాబు అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు పడే ఇబ్బందులు నాకు తెలుసు. అందుకే వారికి ఏ కష్టం కలగకుండా అన్నివిధాలా చర్యలు తీసుకుంటూ వారిని మనస్ఫూర్తిగా ఆదుకుంటాను. అది నా నైజం. దీంట్లో ఎటువంటి రాజకీయాలు ఉండవు. మీకు ఏ కష్టం వచ్చినా నేనున్నాను అనే భరోసా ఇచ్చేందుకు ఇంతదూరం వచ్చి మీతో మాట్లాడితే మీ కష్టం తీరడంతోపాటు నాలో కూడా బాధ తగ్గుతుంది. మీరు అధైర్య పడొద్దు. మీకు నేనున్నానంటూ పదేపదే భరోసా ఇచ్చారు. అదే రీతిన బెండమూర్లంకలో తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంట నష్టాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు రైతు నాయకులు యాళ్ల బ్రహ్మానందం, యాళ్ల దొరబాబులతోపాటు పలువురు రైతుల నుంచి నష్టాలను అడిగితెలుసుకున్నారు. పంట నష్టాలను అధికారులు నివేదించిన తర్వాత రైతులకు సహాయం ప్రకటిస్తానని రైతుల సమక్షంలో హర్షధ్వానాల మధ్య ప్రకటించి వారికి భరోసా ఇచ్చారు.



హమ్మయ్య.. గట్టెక్కాం!

- తప్పిన తుఫాన్ ముప్పు
- ఊపిరి పీల్చిన ప్రజలు
- మునిగిన రైతాంగం
- పంటలకు తీవ్ర నష్టం
- రోడ్లు ధ్వంసం
- 244 విద్యుత్ స్తంభాలు నేలమట్టం
- 26 ట్రాన్స్‌ఫార్మర్లకు దెబ్బ
- నేలకూలిన 96 చెట్లు
- వెంటనే పునరుద్ధరించిన అధికార యంత్రాంగం
- మంత్రి దుర్గేష్, కలెక్టర్, ఎమ్మెల్యేల పర్యటనలు
- విమానాలు, బస్సులు, రైళ్ల రాకపోకలు యథాతథం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ముప్పు తప్పింది. కాకినాడ నుంచి అంతర్వేది వరకూ ఎక్కడ తీరం దాటినా రాజమండ్రితోపాటు జిల్లాలో కూడా ప్రభావం ఉండేది. కానీ తుఫాన్ దోబూచులాడుతూ గంటల కొద్దీ ఇబ్బంది పెట్టినా, అనుకున్నంత స్థాయిలో ప్రభావం చూపకుండానే ప్రజల మీద కనికరం చూపింది. దీంతో జిల్లా ప్రజలతోపాటు జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. కానీ సాధారణ వర్షాలు, వరదలకు నష్టపోయినట్టే పంట నష్టాలు అధికంగానే ఉన్నాయి. వరి, అపరాలు, ఉద్యానవన పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. చాలా పంటనీట మునిగిపోయింది. ఇది తేరుకోవడానికి సమయం పడుతుంది. కానీ నష్టమే ఎక్కువ ఉంటుంది. తుఫాన్ ప్రభావంతో మంగళ, బుధవారాలలో జిల్లాలో మొత్తం 96 చెట్లు నేల కూలిపోగా, 244 విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. 26 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. కానీ కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండడం, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, జిల్లాలోని ఎమ్మెల్యేలు నిత్యం అధికార్లకు సూచలు, సలహాలు ఇవ్వడంతోపాటు నిత్యం ప్రజల్లోనే ఉండడం, ప్రత్యేకాధికారి కె.కన్నబాబు సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో మొత్తం అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు స్పందించి, సమస్య లేకుండా చేసి శభాష్ అనిపించుకున్నారు. మొత్తం 2 వేలకు పైగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సిబ్బంది పనిచేశారు. భారీ గాలులు, వానలకు చెట్లు కూలిపోవడంతోపాటు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. కానీ 1200 మంది విద్యుత్ కార్మికులు, అధికారులు పనిచేసి తెల్లవారుజామునకే పడిపోయిన చెట్లను, స్తంభాలను పునరుద్ధరించారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండడంతోపాటు తుఫాన్ గురించి విస్తృత ప్రచారం వల్ల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండడంతో జిల్లాలో ప్రాణ నష్టం ఏమీ జరగలేదు. జిల్లాలో 244 విద్యుత్ స్తంభాలు నేలకూలగా, 26 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. బుధవారం తెలవారుజాము సమయానికి మొత్తం పునరుద్ధరించి విద్యుత్ సరఫరా అందించారు. ఏపీఈపీడీసీఎల్‌కు సుమారు 45 లక్షల నష్టం జరిగినట్టు అంచనా వేశారు. వరిపంట అత్యధికంగా 18 మండలాల పరిధిలోని 207 గ్రామాల్లోని 17325మంది రైతులకు చెందిన 1012.25 హెక్టార్లు వరి పంట దెబ్బతింది. 13,213 హెక్టార్ల వరిపంట నేలకొరిగింది. ఇక ఐదుమండలాల పరిధిలోని 27గ్రామాలలోని 1497మంది రైతులకు చెందిన1041.8హెక్టార్లలోని మినప పంట దెబ్బతినగా, 306.8హెక్టార్లలో నీటికి ఒరిగిపోయింది. మొత్తం జిల్లాలో 234 గ్రామాల పరిధిలోని 18,822 రైతులకు చెందిన 2054.05 హెక్టార్లలో పంట పూర్తిగా దెబ్బతినగా, 13,520.19 హెక్టార్లలో ఒరిగిపోయింది. ఇక ఎర్రకాలువకు వరద రావడంతో నిడదవోలు, గోపాలపురం నియోజక వర్గాల పరిధిలో వరి మునిగిపోయింది. జిల్లాలో 1960మంది రైతులకు చెందిన 1108.80 హెక్టార్లలో ఉద్యానవన పంటలు, జిల్లాలో 96 గృహాలు కూలిపోయాయి. పంచాయతీరాజ్‌కు చెందిన 50కి.మీ రోడ్డు గోతులుపడ్డాయి.



నిడదవోలు మండలం కంసాలపాలెం వద్ద ఎర్రకాలువ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్



నల్లజర్లలో తుఫాన్ నష్టంపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్





కడియం ఆవలో పడిపోయిన పాలాలను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు.. తుఫాన్ తీరాన్ని దాటుతున్న బుధవారం తెల్లవారుజామున పెరవలి నుంచి అంతర్వేది వైపు ఆకాశంలో కనిపించిన వెలుగు.. తీపర్రులో పడిన అరటి

రవాణా వ్యవస్థ యథాతథం

జిల్లాలో బుధవారం రవాణా వ్యవస్థను పునరుద్ధరించారు. సాధారణ స్థితికి రాకపోకలు చేరుకున్నాయి. రాజమండ్రి ఎయిర్‌పోర్టు నుంచి తుఫాన్ వల్ల నిలిచిపోయిన విమానాలను బుధవారం పునరుద్ధరించారు. సాధారణ రోజుల్లో మాదిరిగానే ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, తిరుపతి, చెన్నై, బెంగళూరుకు వెళ్లి వచ్చే మొత్తం 11 సర్వీసులను పునరుద్ధరించారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే జిల్లాలో ఆర్టీసీ బస్సులన్నీ కూడా మామూలుగానే రోడెక్కాయి. రైళ్లు చాలావరకూ నడుస్తున్నాయి.

పెరిగిన వరి నష్టం... 16,172.06 హెక్టార్లలో నేలకొరిగిన పంట

జిల్లాలో పంట నష్టం అంచనాలు పెరుగుతున్నాయి. బుధవారం సాయంకాలం 6 గంటలకు అందిన సమాచారం ప్రకారం జిల్లాలో 22,504 మందికి చెందిన 2115.74 హెక్టార్లలో వరిపంట, అపరాల పంట దెబ్బతింది. 16,172 హెక్టార్లలో పంట నేలకొరిగింది. జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు కథనం ప్రకారం జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో మొత్తం వరి 70,046 హెక్టార్లలో సాగు చేయగా, తుఫాన్ ప్రభావం వల్ల 16092.1 హెక్టార్లలో పంట నేలకొరిగింది. 896.3 హెక్టార్లలో పంటకు నష్టం జరిగింది. ఇది 18మండలాల పరిధిలోని 209 గ్రామాలకు చెందిన 20,843 మంది రైతులకు చెందిన పంట. ఇది పాలుపోసుకునే దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఉంది. మినప పంట 2160.5 హెక్టార్లలో సాగుచేయగా, 80 హెక్టార్లలో నేలకొరిగింది. 1216.27 హెక్టార్లలో పూర్తిగా దెబ్బతింది. ఇది 7 మండలాల పరిధిలోని 35 గ్రామాలకు చెందిన 1658 మంది రైతులకు చెందినది.

జిల్లాలో 411.2 మీమీ వర్షపాతం నమోదు

రాజమహేంద్రవరం సిటీ : తుఫాన్ ప్రభావంతో గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు 19 మండలాల పరిధిలో 411.2 మీమీ వర్షం కురిసింది అందులో అత్యధికంగా దేవరపల్లి మండలంలో 52.2 మీమీ వర్షం కురిసింది. జిల్లాలో ఎడతెరపిలేకుండా వర్షం పడుతోంది. మండలాల వారీగా పరిశీలిస్తే అనపర్తిలో 11.2 మీమీ, బిక్కవోలులో 13.6 మీమీ, చాగల్లులో 7.4 మీమీ, గోకవరంలో 40.2 మీమీ, గోపాలపురంలో 17.0మీమీ, కడియంలో 7.8మీమీ, కోరుకొండలో 20.4 మీమీ, కొవ్వూరులో 11.6 మీమీ, నల్లజర్లలో 39.6మీమీ, నిడదవోలులో 33.8 మీమీ, పెరవలిలో 10.4 మీమీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 12.8 మీమీ, రాజమహేంద్రవరంలో 11.0మీమీ, రాజానగరంలో 28.8 మీమీ, రంగంపేటలో 23.8 మీమీ, సీతానగరంలో 26.4 మీమీ, తాళ్లపూడిలో 26.0మీమీ, ఉండ్రాజవరంలో 18.2 మీమీ వర్షం కురిసింది. బుధవారం ఉదయానికి జిల్లావ్యాప్తంగా 384.0మీమీ వర్షం కురిసింది.అదే సాయంత్రానికి 27.2 మీమీ వర్షం నమోదైంది. సగటున జిల్లాలో 21.6 శాతం వర్షం కురిసిందని వాతావరణశాఖ తెలిపింది.

ప్రజల భద్రత.. రైతుల పంట రక్షణకు ప్రాధాన్యం

ఎర్రకాల్వను పరిశీలించిన కలెక్టర్ కీర్తి చేకూరి



అనంతపల్లి వద్ద ఎర్ర కాల్వ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

నల్లజర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో నల్లజర్ల మండలంలోని అనంతపల్లి గ్రామం వద్ద ఎర్ర కాల్వ వరద నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల భద్రత, రైతుల పంట రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రైతుల నష్టాలను అంచనా వేసి తక్షణ సాయం అందించే చర్యలు చేపడతామన్నారు. ప్రతి కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తామన్నారు. అధికారులు శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి ఎవరూ ఆందోళన చెందకుండా చూడాలన్నారు. అదేవిధంగా ఎర్రకాల్వ గడ్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి ఎర్రకాల్వకు వరద నీరు వస్తుందని, ఎంత వరద నీరు వస్తే ఇక్కడ ఎంత ప్రభావం ఉంటుందో ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అమె వెంట ఆర్డీవో రాణి సుస్మిత, స్థానిక తహశీల్దార్ నాయుడు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

సీఎంకి సచివాలయ ఉద్యోగుల కృతజ్ఞతలు

రాజమహేంద్రవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ విపత్తు సమయంలో సచివాలయ ఉద్యోగులు నిర్వహించిన సమర్థవంతమైన విధులకు సీఎం చంద్రబాబు తెలియజేసిన అభినందనలకు ఏపీ విలేజ్ అండ్ వార్డ్ సెక్రటేరియేట్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు తెలియజేసింది. బుధవారం జరిగిన జిల్లా అడహాక్ కమిటీ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వరసాల రామదాసు మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి వరకూ అంతా ఏకతాటిపై సమన్వయంతో పనిచేయడం వల్లే నష్టం తప్పిందన్నారు.

పునరావాస కేంద్రాల్లో సేవలు భేష్ : చైర్మన్


నిడదవోలులో మందులు, ఆహారాన్ని అందిస్తున్న చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పునరావాస కేంద్రాల్లో తుఫాన్ బాధితులకు అధికారులు అందిస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తెలిపారు. బుధవారం నిడదవోలు పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో ఆహారం, వైద్యం అందించడం జరుగుతోందన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు అధికార యంత్రాంగం ఇలాగే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, జనసేన నాయకులు డా. కల్యాణ్‌చక్రవర్తి, మునిసిపల్ కౌన్సిలర్లు, తదితరులు ఉన్నారు.

తుఫాన్ పునరావాస కేంద్రాల తనిఖీ

• సదుపాయాలపై ఆరా తీసిన ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలోని తుఫాన్ పునరావాస కేంద్రాలను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి బాధితులను సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తుఫాన్‌కు దెబ్బతిన ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారన్నారు. వారందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే తుఫాన్ బాధితులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్లో పునరావాస కేంద్రాన్ని నాయకులు సందర్శించారు. తాడిమళ్ల విజయవాణి బాధితులకు బియ్యం బస్తాలు, బోడపాటి ముత్యాలరావు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, అడ్డూరి సత్యనారాయణ, గెల్లా కేశవ తదితరులు పాల్గొన్నారు. అలాగే బాధితులకు యూటీఎఫ్ నాయకులు అల్పాహారాన్ని అందజేశారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సురేష్‌కుమార్, ఎండీ ఇమ్రాన్ బాషా, శ్రీనివాస్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల న్యాయ సేవా సంస్థల చైర్మన్, అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ ఆదేశాల మేరకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్ పునరావాస కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా తుఫాన్ బాధితులకు సేవలను అందజేశారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు వర్రే మురళి, వై.ప్రకాష్, టి.ప్రభాకర్, ఏ.టీఎస్.సుందరి, శ్రీవల్లి, తారాకుమారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాపవరం సొసైటీ అధ్యక్షుడు సుంకర సత్తిబాబు ఆధ్వర్యంలో జనసైనికులు తుఫాన్ బాధితులకు సేవలను అందజేశారు.

సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌కు పంగిడి విద్యార్థి ఎంపిక


గంటా యశస్విని

కొవ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పంగిడి జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న గంటా యశస్విని ఢిల్లీలో నవంబరు 6వ తేదీ నుంచి 8 వరకు జరగనున్న సైన్స్ ఎక్స్‌పోజర్ ఎడ్యుకేషనల్ టూర్‌కి ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం ఎం.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఎస్.సి.ఇఆర్.టి విద్యార్థుల్లో సృజనాత్మకత, నూతనావిష్కరణలను పెంపొందించేందుకు సైన్స్ ఎక్స్‌పోజర్ ఎడ్యుకేషనల్ టూర్ నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ టూర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 52 మంది విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. రష్యన్ సెంటర్ ఆఫ్ సైన్స్ కల్చర్, నేషనల్ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియం వంటి ప్రఖ్యాత సంస్థలను సందర్శించడంతో పాటు పేరొందిన శాస్త్రవేత్తలను కలుసుకుని ముఖాముఖి నిర్వహించడం జరుగుతోందన్నారు. యశస్విని ఎంపికపై సైన్స్ ఉపాధ్యాయురాలు జుత్తిగ కళావతి, కలగర లక్ష్మీ, అరుణకుమారి, సుసన్నరాణి, రాజులమ్మ అభినందించారు.

కారు ఢీకొని ఒకరి మృతి

కొవ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఆటోడ్రైవర్ మృతిచెందినట్టు కొవ్వూరురూరల్ ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. చాగల్లు మండలం ధారవరం గ్రామానికి చెందిన షేక్ ఖాదర్ ఖాజా (42) ధవళేశ్వరంలోని ఓ గ్యాస్ ఏజెన్సీలో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగా బుధవారం బైక్‌పై పనికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా... బ్యారేజ్‌పై బొబ్బర్లంక, మద్దూరులంక మధ్య వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ఖాజా కింద పడిపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్టు 108 సిబ్బంది ధ్రువీకరించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు షేక్ సాహెబ్ అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ట్రైనీ ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు...

కొవ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందినట్టు కొవ్వూరురూరల్ ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ... పెనకనమెట్ట గ్రామానికి చెందిన పల్లా నారాయణరావు ఈనెల 8వ తేదీన పొలంలో గడ్డిమందు కొట్టి మిగిలిన మందుని థమ్సప్ బాటిల్‌లో వేసి ఇంటి వద్ద ఉంచాడు. దాన్ని కూల్ డ్రింక్ అనుకుని నారాయణరావు చిన్న కుమారుడు పల్లా నిశాంత్ (17) అదేరోజు రాత్రి 10-30 గటంల సమయంలో తాగేశాడు. వాంతులు చేసుకుంటుండగా నిశాంత్ అన్న లోకేష్ కృష్ణకుమార్ చూసి బంధువుల సాయంతో చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అత్యవసర నిమిత్తం రాజమహేంద్రవరం, అక్కడ నుంచి కాకినాడకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్టు మృతుడి సోదరుడు పల్లా లోకేష్ కృష్ణకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు తెలిపారు.

రేపు చినకాశీరేవులో యజ్ఞవల్క జయంతి

నిడదవోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకాశీరేవులో వేంచేసి ఉన్న శ్రీ సూర్య యజ్ఞవల్క, ఆంజనేయ సద్గురు మందిరంలో శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి యజ్ఞవల్క జయంతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్టు కమిటీ అధ్యక్షుడు పొన్నా కృష్ణ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎవరూ అధైర్యపడొద్దు : మంత్రి దుర్గేష్


పెరవలిలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్


కాల్ధరిలో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులెవరూ అధైర్యపడొద్దని, ఎర్ర కాల్వ ముంపు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ భరోసా ఇచ్చారు. బుధవారం మండలంలోని కంసాలపాలెం, శింగవరం, తదితర ముపంఉ గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంట పొలాలు, అరటి తోటలను పరిశీలించారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ ప్రజలు, రైతులు అధైర్యపడవద్దని బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. నిడదవోలు మండలంలో దాదాపు 17,500 ఎకరాల్లో సాగు అవుతున్న వరిలో అందులో 6,000 ఎకరాల వరకు నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారని చెప్పారు. అలాగే ఎర్ర కాల్వ ప్రవాహం ఉధృతి తగ్గగానే కాల్వ గట్టు పటిష్టతకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కంసాలపాలెం, మాధవరం మధ్య శాశ్వతబ్రిడ్జి నిర్మాణానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శింగవరంలో పునరావాస కేంద్రం సందర్శించి అందులో బాధితులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయనవెంట కూటమి నేతలు, ప్రభుత్వ అధికారులు, తదితరులు ఉన్నారు.

పెరవలి: తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. బుధవారం ముక్కామలలో దెబ్బతిన్న వరి, అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మం త్రి మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నష్టపోయిన పంటల వివరాలను అధికారులు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటిని వెంటనే పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. తహశీల్దార్ నిరంజన్,ఎంపీడీవో పద్మజ, కూటమి శ్రేణులు పిప్పర రవికుమార్, అతికాల శ్రీను, నల్ల సురేంద్ర, ర్యాలంగి రాజేష్, త్రిమూర్తులు, వేంద్ర వెంకట రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పంట నష్టపోయిన రైతులకు సాయం అందేలా కృషిచేస్తామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కాల్ధరిలో తుఫాన్ వల్ల నేలకొరిగి పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. నష్టపోయిన పంటలను ఎన్యూమరేట్ చేసి వారికి సాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మండలంలో 1472 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేసినట్టు మండల వ్యవసాయాధికారి బీ. రాజారావు మంత్రికి వివరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో ఎం. శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ అండగా ఉంటాం

• ఎమ్మెల్యేలు ముప్పిడి, మద్దిపాటి • తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన


చాగల్లులో నేలకొరిగిన అరటి తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి


పల్లంట్లలో బాధిత కుటుంబానికి నగదు అందజేసిన ఎమ్మెల్యే మద్దిపాటి

చాగల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ బాధితులతో మాట్లాడారు. చాగల్లులో నేలకొరిగిన అరటి తోటలు, వరి చేలను పరిశీలించారు. కలవలపల్లి శివారు రామచంద్రపురంలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. దీనిలో భాగంగా బాధితులకు నగదుతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, తహశీల్దార్ ఎం. మెరికమ్మ, ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, టీడీపీ నాయకులు అబ్బూరి సీతారాముడు, పత్తిపాటి శశాంక్, దొంగ రామకృష్ణ, బొల్లిన శివనాగేంద్ర, చిటికెన పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తుఫాన్ నేపథ్యంలో అధికారులంతా ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంక టేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మండలంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయమై ఆరా తీశారు. దీనిలో భాగంగా అన్నదేవరపేటలో పాక్షికంగా దెబ్బతిన్న పురాతన బ్రిడ్జి, నేలకూలిన ఇళ్లు, పరిసర ప్రాంత ప్రజల కోసం ఏర్పటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం అన్నదేవరపేట, వెంకటాయపాలెం రహదారిలో ప్రవహిస్తున్న కొవ్వాడ కాలువ ఉధృతిని చూశారు. తర్వాత ప్రక్కిలంకలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సిద్దా దుర్గారావు, నామన పరమేశ్వరరావు, కొఠారు వెంకట్రావు, కూచిపూడి గణపతి, అనపర్తి ప్రసాద్, ముళ్లపూడి రామచంద్రం, కాకర్ల వంశీ, దండమూడి శేషు, గంటా శివరామకృష్ణ, తహశీల్దార్ లక్ష్మీలావణ్య, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ఏవో రుచిత, తదతర మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. బుధవారం మండలంలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానంగా సంపత స్వర్ణ, స్వర్ణ రకాల వరిపంటకు ఎక్కువగా నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. మండలంలో ఇప్పటి వరకు 473 హెక్టార్లలో వరి పంట దెబ్బతిన్నట్టు ఏవో సోమశేఖర్ తన బృందంతో కలిసి ప్రాథమిక అంచనా వేశారు. ఈయనతోపాటు ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు,నల్లజర్ల సొసైటీ చైర్మన్ రావూరి వెంకట రమణ, వ్యవసాయ అధికారులు, తదితరులు ఉన్నారు.

దేవరపల్లి: తుఫాన్ బాధితులను తక్షణమే ఆదుకునివారికి పూర్తి సహకారం అందించటం జరుగుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. మొంథా తుఫాన్ వల్ల పల్లంట్ల, ఉప్పరగూడెం, ధూమంతనగూడెంలో గృహాలు దెబ్బతినడంతో ఆ కుటుంబాలను పరామర్శించి తక్షణ సాయంగా నగదును అందజేశారు. పల్లంట్లకి చెందిన జాలిపర్తి పాములమ్మ, ధూ మంతనగూడెంకి చెందిన కాకుల విజయలక్ష్మి ఇళ్లు పూర్తిగా దెబ్బతినడంతో ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున అందజేశారు. అలాగే పల్లంట్లలో మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు, జాలపర్తి పాములమ్మకు రూ. ఐదు వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి సుధారాణి, ఎంపీడీవో నాగార్జునరావు, తహశీల్దార్ శ్రీనివాస్, టీడీపీ నేతలు ఆచంట శ్రీరామ్ ప్రసాద్, చింతాల దాసు, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రామారావు, బళ్లా సూర్యచక్రం, పరిమి శ్రీరామకృష్ణ, మెంతిమి అమరావతి పాల్గొన్నారు.

గోపాలపురం: తుఫాన్ ప్రభావంతో చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లిలో నేలకొరిగిన వరి చేలను బుధవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పరిశీలించి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రతి ఏటా కొవ్వాడ కాల్వ ప్రభావంతో వరి చేలు నీటమునిగి రైతులు నష్టపోయేవారన్నారు. కాగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాల్వలో పూడిక తీత పనులు చేపట్టడంతో పంట సురక్షితంగా ఉందన్నారు. దీంతో రైతులకు ఎటువంటి నష్టం జరగలేదన్నారు. అలాగే మండలంలో ఆయా గ్రామాల్లో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబా లకు తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున సొంత నిధులు అందజేశామన్నారు. ఆయన వెంట తహశీల్దార్ సాయిప్రసాద్, ఎంపీడీవో రాజమనోహర్, ఎస్ఐ మనోహర్, టీడీపీ మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము, చెరుకుమిల్లి సొసైటీ అధ్యక్షుడు గద్దే హరిబాబు, నూతంగి దొరబాబు, జ్యేష్ఠ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు. అలాగే తుఫాన్ ప్రభావంతో ఇళ్లు కోల్పోయిన భీమోలు గ్రామానికి చెందిన మల్లిపూడి సంకురయ్య కుటుంబానికి ఎమ్మెల్యే మద్దిపాటి సొంత నిధులు రూ.10 వేలును టీడీపీ మండల ఉపా ధ్యక్షుడు కాట్రగడ్డ సురేశ్, భీమోలు గ్రామ కమి టీ అధ్యక్షుడు అప్పారావు, గోపాలపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు భూరెడ్డి వాసు, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జ్యేష్ఠ శ్రీధర్, టీడీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, తదితరులు అందజేశారు.

నేలమట్టమైన వరి, అరటి తోటలు

• పంట నష్టాలపై ఆరా తీస్తున్న అధికారులు


కొవ్వూరులో తుఫాన్‌కు నేలమట్టమైన వరి పొలాలు

కొవ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో తుఫాన్ ప్రభావంతో నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పూర్తిగా పునరుద్ధరించినట్టు తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై పార్క్ చేసిన తహశీల్దార్ కారుపై చెట్టు విరిగిపడింది. అలాగే పట్టణంలోని సిద్దార్థ చికెన్ సెంటర్ వద్ద నాలుగు విద్యుత్ స్తంభాలు, బాల్ బాడ్మింటన్ కోర్టు వద్ద 2, మద్దూరులో 2, మద్దూరులంకలో 2, పశివేదలలో 2, ఆరికిరేవులలో 1, దొమ్మేరులో 1, ధర్మవరంలో 1 స్తంభం పడిపోయాయి. పడిపోయిన స్తంభాలను తక్షణం తొలగించి కొత్తవి వేసి విద్యుత్‌ను పునరుద్ధరించినట్టు ఏఈలు డీ. జగదీశ్వరరావు, సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే పట్టణం, మండలంలో తుఫాన్ ప్రభావంతో పడిపోయిన పంటలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులతో కలిసి పరిశీలించారు. తక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో అత్యవసర పనులు చేపట్టి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందజేశామని కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. బుధవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహశీల్దార్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో మొంథా తుఫాన్‌పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తుఫాన్ కోనసీమలో తీరం దాటిన తరువాత డివిజన్‌లో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. డివిజన్‌లోని 3 నియోజకవర్గాల్లో ని 42 పునరావాస కేంద్రాలలో 570 కుటుంబాలు ఉన్నాయన్నారు. వారికి వేడివేడి ఆహారం, వైద్య సదుపాయాలతో పాటు విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు ఏర్పాటుచేశామన్నారు. అలాగే జనరేటర్లు కూడా ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. వృద్ధులు, చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చామన్నారు. డివిజన్‌లో ప్రాథమికంగా 6,828 హెక్టార్ల వరి, 358 హెక్టార్ల మినుము, 135 హెక్టార్ల పొగాకు దెబ్బతిన్నట్టు గుర్తించడం జరిగిందన్నారు. మరో 3 లేదా 4 రోజుల్లో పూర్తి పంట నష్టాలు వస్తాయన్నారు. 134 గ్రామాలలో పంట లకు నష్టం వాటిల్లిందన్నారు. 36 ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. ఇంకా క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామస్థాయిలో తమ విధులు నిర్వహిస్తున్నారన్నారు.

పెరవలి: తుఫాన్ వల్ల ప్రమాదాలు సంభవించకపోయినప్పటికీ చెట్లు కూలడం, విద్యుత్ స్తంభాలు విరిగిపడటం వంటివి జరిగాయి. ముక్కామల, ఖండవల్లి, తదితర ప్రాంతాల్లో విద్యుత్‌స్తంభాలు నేలకొరగడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. ఏఈ డేవిడ్‌నిశ్చల్ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజాము నుంచే బృందం రంగంలోకి దిగి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఖండవల్లి, ముక్కామల, కాకరపర్రు, తీపర్రులో అరటి తోటలు నేలకొరిగాయి. ఎకరానికి సుమారు 50 నుంచి 150 వరకు చెట్లు విరిగిపడినట్టు రైతులు చెబుతున్నారు. అలాగే పెరవలి తీపర్రు, కానూరు ప్రాంతాల్లో కొన్నిచోట్ల వరిచేలు కూడా నేలమట్టమయ్యాయి.

దేవరపల్లి: తుఫాన్‌తో మండలంలో పలు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బొప్పాయి, అరటి తోటలు నేలకొరిగాయి. మండలంలో 530 ఎకరాల్లో వరి నేలమట్టమైనట్టు వ్యవసాయశాఖాధికారి కమలరాజు తెలిపారు. ఉద్యానశాఖాధికారి జీ.రమేశ్ మాట్లాడుతూ కురుకూరు, పల్లంట్ల, దేవరపల్లి, దుద్దుకూరు, గౌరీపట్నంలో ధ్వంసమైన అరటి, బొప్పాయి తోటలను డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూని వర్శిటీ శాస్త్రవేత్తలు అర్చన, కేఆర్ వరప్రసాద్‌రెడ్డి పరిశీలించారన్నారు.

ఉండ్రాజవరం: తుఫాను వల్ల నేలకొరిగిన పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి. రాజారావు బుధవారం తెలిపారు. మండలంలో 4710 హెక్టార్లలో వరిపంట వేయగా, 15 గ్రామాల్లో సుమారు 1472 హెక్టార్లలో వరి నేలకొరిగినట్టు చెప్పారు.


ముక్కామల వద్ద పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం


ఉండ్రాజవరంలో నేలకొరిగిన వరి పంట

వివాహిత అదృశ్యంపై కేసు

కొవ్వూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన చొక్కా మణి ఈనెల 28వ తేదీన తన ఇద్దరు పిల్లలను ఇంటి వద్ద ఉంచి బయటకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లింది. తిరిగి ఎంతకీ రాకపోవడంతో మణి బావ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మోటారు సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు

కొవ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్ ఢీకొని ఒకరు గాయపడినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయ ఏవో కణపరెడ్డి రవికుమార్ వర్మ ఈనెల 26వ తేదీన కార్యాలయానికి బయలుదేరాడు. కాగా, నందమూరు రోడ్డులో వెనుక నుంచి వస్తున్న మోటారుసైకిల్ ఢీకొట్టింది. దీంతో రవికుమార్ వర్మ కాలుకి బలమైన గాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ఆసుపత్రిలో చేరారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

మరో ఘటనలో బాలుడికి..

మోటారుసైకిల్ ఢీకొని బాలుడు గాయపడినట్టు కొవ్వూరు సీఐ పి.విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఈనెల 26వ తేదీన కొవ్వూరు పట్టణంలోని గాయత్రీ థియేటర్ సెంటర్‌లో రోడ్డు దాటుతున్న ఆరు సంవత్సరాల బాలుడు పసల చరణ్‌సాయిని మోటారుసైకిల్ ఢీకొట్టింది. దీంతో ఈ ప్రమాదంలో చరణ్‌సాయి కాలుకి బలమైన గాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో చేరాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, చరణ్‌సాయి తండ్రి శ్రీహరి అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

ఇంకో ఘటనలో ఇద్దరికి...

కొవ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిల్ ఢీకొని ఇద్దరు గాయపడినట్టు కొవ్వూరురూరల్ ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం చాగల్లుకు చెందిన బద్ది మురళీకృష్ణ, తోలేటి రాము ఇద్దరు కలిసి ఈ నెల 24వ తేదీన బండిపై తాళ్లపూడి మండలం రావూరుపాడు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో ధర్మవరం వద్ద మరో బైక్ రాంగ్‌రూట్‌లో వచ్చి వీరి బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ట్రైనీ ఎస్ఐ బెల్లంకొండ జయరాజు తెలిపారు.

మహిళను కొట్టడంతో కేసు

కొవ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పంట పొలంలో అక్రమంగా ప్రవేశించి సోదరిని కొట్టిన సంఘటనలో అన్నదమ్ములపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం దొమ్మేరుకి చెందిన గద్దె వెంకటలక్ష్మి, తన అన్నదమ్ములు గత కొంతకాలంగా ఘర్షణ పడుతున్నారు. ఈనెల 29వ తేదీన వెంకటలక్ష్మి పొలంలోకి అన్నదమ్ములు అక్రమంగా ప్రవేశించి పంటను నాశనం చేయడమే కాకుండా ఆమెను కొట్టి గాయపర్చారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చలిగాలులకు తట్టుకోలేక ఒకరి మృతి

తాళ్లపూడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెద్దేవంలో తుఫాన్ కారణంగా భారీగా వీచిన చలిగాలుల ప్రభావానికి తట్టుకోలేక జొన్నకూటి వీర్రాజు (58) అనే వ్యక్తి మంగళవారం రాత్రి మృతిచెందాడు. దీనిపై కుటుంబ సభ్యులు మాట్లాడుతూ భారీగా వీచిన గాలుల వల్లే చనిపోయినట్టు చెప్పారు.